# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 140 | విశాఖపట్నం | 20-2-2026 శుక్రవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 140 | VISAKHAPATNAM | 20-2-2026 FRIDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇన్‌చార్జ్: డి. లావణ్య

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902





2లో

## ప్రభుత్వం ఇచ్చే ఉచితాల వెనుక ఉన్నది ప్రజల కష్టార్జితం: సుప్రీంకోర్టు



2లో

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్ .. ఐదుగురు మావోయిస్టులు మృతి



6లో

## విటమిన్ బి12 లోపం ఉంటే శరీరంలో కనిపించే లక్షణాలు ఇవే..!

# విశాఖలో వేడుకగా 'ఇంటర్నేషనల్ సిటీ పరేడ్'



2లో

# ఇది బాబు భజన.. అన్నీ తప్పుడు లెక్కలే

## ఏపీ బడ్జెట్‌పై జగన్ విమర్శలు




- ఏపీ బడ్జెట్ అబద్ధాలు, తప్పుడు లెక్కలమయం అని జగన్ విమర్శ
- సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేశారని ప్రభుత్వంపై ఆరోపణ
- రాష్ట్ర ఆదాయం బాబు అండ్ కో జేబుల్లోకి వెళుతోందని ఘాటు వ్యాఖ్యలు
- సొంత ఆదాయాల వృద్ధిలో ఏపీ 22వ స్థానంలో ఉందని వెల్లడి
- నారా లోకేశ్ పైనా తీవ్ర స్థాయిలో జగన్ ధ్వజం

**తాడేపల్లి, పతాకం న్యూస్:** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఇది ప్రజల బడ్జెట్ కాదని, కేవలం చంద్రబాబు భజన, తప్పుడు లెక్కలతో నిండిన మోసపూరిత పత్రమని ఆయన అభివర్ణించారు. గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ప్రభుత్వ తీరును ఎండగట్టారు. "మోసానికి షర్టు, ప్యాంటు వేస్తే అది చంద్రబాబే. అబద్ధానికి రెక్కలు కడితే అది కూడా చంద్రబాబే" అంటూ జగన్ ఘాటు వ్యాఖ్యలతో ప్రసంగాన్ని ప్రారంభించారు. చంద్రబాబు పాలన "పబ్లిసిటీ పీక్.. పర్ఫామెన్స్ వీక్" అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు ఊదరగొట్టిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ (తరువాయి 4వ పేజీలో)

# నేడు ఢిల్లీకి చంద్రబాబు

## ఏఐ ఇంపాక్ట్ సదస్సులో కీలక ఒప్పందాలు!



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో అగ్రగామిగా నిలబెట్టడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలో కీలక పర్యటన చేపట్టనున్నారు. శుక్రవారం ఢిల్లీలోని భారత్ మండపంలో జరగనున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026'లో ఆయన పాల్గొంటారు. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రంలో ఏఐ ఆధారిత అభివృద్ధికి, యువతకు నైపుణ్య శిక్షణకు మార్గం సుగమం చేసేలా పలు అంతర్జాతీయ దిగ్గజ సంస్థలతో కీలక ఒప్పందాలు (ఎంఓయూలు) చేసుకోనున్నారు. ఈ సదస్సులో భాగంగా ఏపీ ప్రభుత్వం పలు చరిత్రాత్మక ఒప్పందాలకు శ్రీకారం చుట్టనుంది. రాష్ట్రంలోని 10 లక్షల మంది యువతకు ఏఐ, క్వాంటం టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ వంటి భవిష్యత్ సాంకేతికతల్లో నైపుణ్యాలు కల్పించేందుకు దిగ్గజ ఐటీ సంస్థ ఐబీఎంతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోనుంది. అలాగే, ఏఐ, క్వాంటం టెక్నాలజీలలో పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించేందుకు యూనిసీసీ సంస్థతో కలిసి 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో క్వాంటం ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు కోసం ఎన్ఐఈఎల్ఐటీ సంస్థతో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ట్యూటర్ కోసం ఐఐటీ మద్రాస్‌తోనూ ప్రభుత్వం ఎంఓయూలు చేసుకోనుంది. ప్రముఖ టెక్ సంస్థ ఎన్విడియా భాగస్వామ్యంతో రాష్ట్రంలో ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై కూడా ఈ సదస్సులో కీలక ప్రకటన చేయనున్నారు.



5లో

## పశువుల ఆసుపత్రుల్లో.. మందుల కృత్రిమ కొరత..!?



## జగన్‌పై పయ్యావుల తీవ్ర వ్యాఖ్యలు..

2లో


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా.. అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా.. పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS

State Bank of India

A/c No: 44576280686

IFSC:SBIN00021297

DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# కృత్రిమ మేధస్సు (ఏఐ)

దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న 'ఇండియా-ఎ.ఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026' సందర్భంగా అనేక కీలకాంశాలు తెరమీదకు వచ్చాయి. భారత్‌ను గ్లోబల్ సౌత్‌కు సాంకేతిక కేంద్రంగా నిలబెట్టాలన్న లక్ష్యంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే, ఆ దిశలో తీసుకుంటున్న చర్యలే ప్రశ్నార్థకంగా మారాయి. అంతర్జాతీయ స్థాయిలో నాయకత్వం వహించే సంగతి అలా ఉంచితే ప్రపంచ స్థాయికి సరితూగే లేదా దగ్గరగా ఉన్న పునాది స్థాయి వ్యవస్థ (ఫౌండేషన్ మోడల్) కూడా మన దగ్గర లేదు. ఈ రంగంలో ఇప్పటికే నాయకత్వం వహిస్తూ ప్రపంచానికి దిశా నిర్దేశం చేస్తున్న అమెరికా, చైనాలు పెద్ద ఎత్తున నైపుణ్యాలను, పరిశోధనలను విస్తృతం చేస్తుండగా, మనం ఏం చేయాలి, ఎలా చేయాలి అన్న దాని దగ్గరే నిలబడిపోయాం. ప్రాథమిక స్థాయి వ్యవస్థను పూర్తి స్థాయిలో స్వదేశీ పునాదిమీద ఏర్పాటు చేసుకోవడం భవిష్యత్తులో అన్ని విధాల మేలు చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. అయితే, అన్ని అంశాలకు అమెరికా వైపు చూసే నరేంద్రమోడీ ప్రభుత్వం ఆ దిశలో చర్యలు తీసుకోవడం అనుమానమే! అట్టహాసంగా నిర్వహిస్తున్న ఎఐ సదస్సులో ఇప్పటి వరకు అటువంటి ప్రకటన ఏదీ కేంద్ర ప్రభుత్వం నుండి వెలువడకపోవడమే ఈ అనుమానానికి కారణం. ఫౌండేషన్ మోడల్ సంగతి అలా ఉంచితే, లార్జి మోడల్స్ ట్రైనింగ్‌కు అవసరమైన హైపర్ స్కేల్ డేటా సెంటర్లు కూడా అందుబాటులో లేవు. ఇవేవీ లేకుండా గ్లోబల్ లీడర్‌షిప్ గురించి, అప్పుడు వెల్లువెత్తే అవకాశాల గురించి మాట్లాడటం ఆకాశానికి నిచ్చెనలు వేయడమే! ఇంపాక్ట్ సమ్మిట్ కోసం నీతి ఆయోగ్ రూపొందించిన నివేదిక ప్రకారం ఎఐ రంగంలో మన దేశం పూర్తిస్థాయిలో సన్నద్ధం కావడానికి మరో పది నుండి ఇరవై ఏళ్లు పడతాయట! ఒక వార్తా సంస్థకు ఇచ్చిన 'ప్రత్యేక' ఇంటర్వ్యూలో 2047 నాటికి ఎఐ రంగంలో భారత్‌ను సూపర్ పవర్‌గా నిలపనున్నట్లు ప్రధాని నరేంద్రమోడీ చెప్పారు. 'కేవలం ఎఐ వినియోగదారునిగా కాకుండా ఎఐ సృష్టికర్తగా, ఎఐ విప్లవంలో భాగస్వామి దశ నుండి దానిని శాసించే స్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దుతున్నాం' అని మోడీ అన్నారు. ఈ మాటలు ఎలా ఉన్నప్పటికీ శాస్త్ర సాంకేతిక రంగాల్లో శరవేగంగా మార్పులు చోటుచేసుకుంటున్న ప్రస్తుత తరుణంలో అప్పటికి పరిస్థితులు ఎలా ఉంటాయో, ఏ కొత్త సాంకేతికత ఉనికిలోకి వస్తుందో తెలియదు! మరోవైపు ప్రపంచంలో ఎఐ అభివృద్ధి విస్ఫోటనం చెందుతోంది. శక్తివంతమైన నమూనాలకు శిక్షణ ఇచ్చే కంప్యూటింగ్ శరవేగంగా పెరుగుతోంది. ప్రత్యేకమైన చిప్‌ల తయారీ కోసం పెద్దఎత్తున పోటీ జరుగుతోంది, భారీ టెక్ సంస్థలు ఎఐలోకి పెద్ద మొత్తాలను కుమ్మరిస్తున్నాయి. 2024 నుండి అమెరికా, చైనాలు ఈ రంగంపై దృష్టి సారించి భారీ మొత్తంలో ఖర్చు చేస్తుండగా, మన దేశంలో మోడీ సర్కారు ఈ రంగ అభివృద్ధి కోసం ఎంత ఖర్చు చేయనుందన్న విషయంలో ఇప్పటి వరకు స్పష్టత లేదు.

మరోవైపు ఎఐ వద్ధి పేరుతో వ్యక్తిగత గోప్యతకు ముప్పు తలెత్తే ప్రమాదం ఉంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ప్రభావం పడనుంది. న్యాయవ్యవస్థలో కూడా ఎఐ వినియోగంపై జాగ్రత్త అవసరమని ఇటీవల సుప్రీంకోర్టు సూచించింది. ఆరోగ్య రంగంలోనూ ఇటువంటి ఆందోళనలే వ్యక్తమవుతున్నాయి. మీడియా, రాజకీయ రంగాల్లో డీప్‌ఫేక్‌ల భయాలు ఇప్పటికే ప్రారంభమైనాయి. పెద్ద టెక్ సంస్థల ఆధిపత్యం పెరిగితే డేటా, మౌలిక వసతులు వారి చేతుల్లోనే కేంద్రీకృతమయ్యే ప్రమాదం ఉంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని బలమైన పారదర్శక చట్టాలు, డేటా రక్షణ, నైతిక నియంత్రణ, సమగ్ర శిక్షణ విధానాలను అందరితో చర్చించి పారదర్శకంగా రూపొందించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. అదే విధంగా దేశంలో ఉన్న యువశక్తిని సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు, డేటా సెంటర్లు, ఫౌండేషన్ మోడల్స్, చిప్ తయారీ వంటి అంశాలపై దృష్టి సారించాలి. ఢిల్లీ ఎఐ సదస్సులో చోటుచేసుకున్న సాంకేతిక లోపాలతో పాటు, మేడ్ ఇన్ చైనా రోబోడాగ్‌ను తమ సొంత ఆవిష్కరణగా ప్రకటించుకుని నగుబాటైన గల్గోటియాస్ యూనివర్శిటీ నిర్వాకం అంతర్జాతీయ వేదికపై దేశ ప్రతిష్టను మసకబార్చాయి. భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా చూడాలి.

# విశాఖలో వేడుకగా 'ఇంటర్నేషనల్ సిటీ పరేడ్'



- భారత దళాలతో పాటు పలు దేశాల నావికాదళాల కవాతు
- అబ్బురపరిచిన వైమానిక విన్యాసాలు, కమాండోల ప్రదర్శనలు
- ముఖ్య అతిథిగా పాల్గొన్న గవర్నర్ అబ్దుల్ నజీర్
- వివిధ దేశాల సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** 'సిటీ ఆఫ్ డెస్టినీ' విశాఖపట్నం సాగర తీరం గురువారం సాయంత్రం అద్భుత ప్రదర్శనలకు వేదికైంది. ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ , మిలన్ 2026 వేడుకల్లో భాగంగా ఆర్కే బీచ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ నగర పరేడ్ కన్నుల పండువగా సాగింది. భారత నావికాదళ శక్తి సామర్థ్యాలు, వివిధ దేశాల సాంస్కృతిక వైభవానికి ఈ పరేడ్ దర్పణం పట్టింది. ఈ భారీ పరేడ్‌లో భాగంగా తొలుత భారత నావికాదళ విమానాలు, హెలికాప్టర్లు గగనతలంలో అబ్బురపరిచే విన్యాసాలు చేశాయి. అనంతరం భారత త్రివిధ దళాలు (ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్), కోస్ట్ గార్డ్ కంటింజెంట్లు కవాతు నిర్వహించాయి. వీరితో పాటు ఫ్రాన్స్, రష్యా, వియత్నాం, థాయ్‌లాండ్, శ్రీలంక సహా పలు మిత్ర దేశాల నావికాదళ సిబ్బంది, వారి సెరిమోనియల్ బ్యాండ్‌లు ప్రదర్శనలో పాల్గొని ఆకట్టుకున్నాయి. ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరై గౌరవ వందనం స్వీకరించారు. నేవీ కమాండోలు ప్రదర్శించిన సాహస కృత్యాలు, డ్రోన్, లేజర్ షోలు, చివరిలో బాణసంచా వెలుగులు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. వివిధ దేశాల కళాకారులు వారి సంప్రదాయ నృత్యాలతో అలరించారు. భారత నౌకాదళ శక్తిని ప్రపంచానికి చాటడంతో పాటు, మిత్ర దేశాలతో సముద్ర భద్రతలో సహకారాన్ని, సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ పరేడ్‌ను నిర్వహించారు. ఈ అంతర్జాతీయ వేడుకకు భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో ఆర్కే బీచ్ పరిసరాలు జనసంద్రంగా మారాయి. నిర్వాహకులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

# ప్రభుత్వం ఇచ్చే ఉచితాల వెనుక ఉన్నది ప్రజల కష్టార్జితం: సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశంలో రాజకీయ పార్టీలు అందిస్తున్న ఉచిత పథకాలపై సుప్రీంకోర్టు మరోసారి తీవ్రస్థాయిలో స్పందించింది. తమిళనాడు విద్యుత్ పంపిణీ సంస్థకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ఉచిత పథకాల వల్ల దేశ ఆర్థికాభివృద్ధి కుంటుపడుతుందని కోర్టు హెచ్చరించింది. తమిళనాడులో ఉచిత విద్యుత్ సరఫరా, ఆర్థిక స్థితిగతులపై విచారణ చేపట్టిన కోర్టు, విద్యుత్ పంపిణీ సంస్థకు నిధులు ఎక్కడి నుండి వస్తున్నాయో వివరించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. దీనిపై పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని కోరింది. పేదలకు విద్య, కనీస అవసరాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని కోర్టు అంగీకరించింది. అయితే, పెద్ద పెద్ద భూస్వాములకు కూడా ఉచిత విద్యుత్ అందించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. 'సౌకర్యం కావాలనుకున్నప్పుడు డబ్బులు చెల్లించాలి కదా! పెద్ద భూస్వాములు ఉచితం అని అనవసరంగా లైట్లు, మెషీన్లు వాడుతున్నారు' అని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ఎన్నికలకు ముందే ఉచిత పథకాలను ప్రకటించే సంస్కృతిపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజకీయ పార్టీలు, సామాజికవేత్తలు తమ సిద్ధాంతాలను పునరాలోచించుకోవాల్సిన అవసరం ఉందని హితవు పలికింది. ప్రభుత్వం ఇచ్చే ఉచితాల వెనుక ఉన్నది ప్రజల కష్టార్జితమైన పన్నుల సొమ్ము అని కోర్టు గుర్తు చేసింది. రాష్ట్రాలు అప్పుల్లో ఉన్నప్పటికీ ఉచిత పథకాలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించింది. రాష్ట్రాలు వసూలు చేసే ఆదాయంలో కనీసం 25 శాతాన్ని రాష్ట్ర అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు ఎందుకు ఉపయోగించకూడదని ధర్మాసనం సూటిగా ప్రశ్నించింది. అంతేకాదు, 'ఉచితాలు ఎన్నాళ్లు కొనసాగుతాయి?' అన్న సుప్రీంకోర్టు ప్రశ్న ఇప్పుడు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సవాలుగా మారింది. సంక్షేమం పేరుతో ఆర్థిక క్రమశిక్షణను విస్మరిస్తే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు తప్పవని అత్యున్నత న్యాయస్థానం హెచ్చరించింది.

# మండలిలో హెరిటేజ్‌పై వైసీపీ ఆరోపణలను తీవ్రంగా ఖండించిన మంత్రి అచ్చెన్నాయుడు

**అమరావతి, పతాకం న్యూస్:** హెరిటేజ్ సంస్థపై వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలను రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా ఖండించారు. చీజ్ ప్యాకెట్లు చేతిలో పట్టుకుని, వాటిని నెయ్యి అని చూపిస్తూ ప్రజలను, సభను తప్పుదోవ పట్టిస్తున్నారని, వైసీపీ నేతలకు కనీస అవగాహన ఉందా అని శాసనమండలిలో నిలదీశారు. మండలిలో వైసీపీ సభ్యుల తీరు అత్యంత బాధ్యతారాహిత్యంగా ఉందని ఆయన విమర్శించారు. ఇందాపూర్ డెయిరీకి, హెరిటేజ్ సంస్థకు ఎలాంటి సంబంధం లేదని గత రెండు రోజులుగా తాను స్పష్టంగా సమాధానం ఇస్తున్నప్పటికీ, అదే అంశాన్ని పట్టుకుని సభా సమయాన్ని వృథా చేయడం దుర్మార్గమని అచ్చెన్నాయుడు అన్నారు. ముఖ్యంగా మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణను ఉద్దేశించి, "చీజ్ ప్యాకెట్లను చూపిస్తూ నెయ్యి ప్యాకెట్లు అంటూ ప్రజలను మోసం చేస్తున్నారు. మీకు చీజ్‌కు, నెయ్యికి మధ్య తేడా కూడా తెలియదా?" అని ఎద్దేవా చేశారు. హెరిటేజ్‌పై అంతగా అనుమానాలు ఉంటే ఒక్కటంటే ఒక్క చిన్న ఆధారాన్నైనా సభ ముందు పెట్టాలని, లేనిపక్షంలో బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# జగన్‌పై పయ్యావుల తీవ్ర వ్యాఖ్యలు..



**అమరావతి, పతాకం న్యూస్:** 2026–27 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌పై జరిగిన చర్చలో భాగంగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో సమాధానం ఇచ్చారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూనే.. వైసీపీ గత పాలనపై మంత్రి మండిపడ్డారు. 'వైసీపీ నెవ్వర్ ఎగైన్.. కూటమి వన్స్ ఎగైన్' అంటూ అసెంబ్లీ వేదికగా పయ్యావుల వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రానికి వైసీపీ హానికరం అనే స్టాట్యూటరీ వార్నింగ్ నిరంతరం ఇస్తూనే ఉండాలని స్పష్టం చేశారు. ఇజ్రాయిల్ దేశస్థుల తరహాలో ప్రజలు కూడా మన రాష్ట్రం అనే భావనను పెంపొందించుకోవాలని సూచించారు. అధిక వడ్డీలతో తెచ్చిన రుణాలపై వడ్డీ రేట్లు తగ్గించేలా సంప్రదింపులు జరుపుతున్నామని మంత్రి వెల్లడించారు. సుమారు రూ.2 వేల కోట్ల మేర వడ్డీలు తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఏడాదికి రూ.2 వేల కోట్లు ఆదా అయితే.. చాలా పథకాలు సమర్థవంతంగా అమలు చేయవచ్చన్నారు మంత్రి. గత ప్రభుత్వంతో పోల్చుకుంటే మైనింగ్ శాఖలో 33 శాతం, ఎక్సైజ్ శాఖలో 24 శాతం ఆదాయం పెరిగిందని వివరించారు. గత ప్రభుత్వంలో గనులు, ఎక్సైజ్ ఆదాయం తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లిందని వైసీపీపై పయ్యావుల విమర్శలు గుప్పించారు. కూటమి జరిపిన భూ కేటాయింపుల వల్ల కలిగిన లాభాలను.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిపిన భూ కేటాయింపుల వల్ల కలిగిన నష్టాలను మంత్రి సభలో ఏకరువు పెట్టారు. సీఎం చంద్రబాబు హయాంలో భూములు కేటాయిస్తే... కియా, హెచ్‌సీఎల్, అశోక్ లేలాండ్, హీరో కంపెనీ, టీసీఎస్, కాగ్నిజెంట్, గూగుల్ ఏఐ డేటా సెంటర్ వంటి సంస్థలు వచ్చాయని తెలిపారు. వైసీపీ హయాంలో ఇచ్చిన భూముల్లో ఒక్క కంపెనీ కూడా రాలేదని గుర్తుచేశారు. లేపాక్షి నాలెడ్జ్ హబ్, వ్యాన్ పిక్, బ్రాహ్మణి స్టీల్స్‌కు భూములిచ్చినా.. ఒక్క ఎంఎస్ఎంఈ కూడా రాలేదని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్ అంశంపై సభలో పయ్యావుల ఆసక్తికర కామెంట్లు చేశారు. సీఎం చంద్రబాబు తీసుకున్న చొరవతో పరిశ్రమల్లోనే కాదు.. పొలాల్లో కూడా పెట్టుబడులు పెడుతున్నారని తెలిపారు. ఢిల్లీ నుంచి వచ్చి కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని పొలాలను కొంటున్నారని, దానిమ్మ పండిస్తున్నారని వెల్లడించారు. చంద్రబాబు చొరవతో రాయలసీమ ఉత్పత్తులకు అరకు తరహాలో అంతర్జాతీయ బ్రాండింగ్ రాబోతోందంటూ సంతోషం వ్యక్తం చేశారు. అలాగే, రాయలసీమ ప్రాజెక్టులకు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన ద్రోహాన్ని మంత్రి పయ్యావుల వివరించారు. 102 రాయలసీమ ప్రాజెక్టులను ఒక్క సంతకంతో రద్దు చేశారని జగన్‌పై ఫైర్ అయ్యారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును నిర్మించడం లేదని నాడు కేంద్రానికి అప్పటి ఇరిగేషన్ స్పెషల్ సీఎస్‌గా ఉన్న ఆదిత్యనాథ్ దాస్ స్పష్టం చేశారంటూ డాక్యుమెంట్లను మంత్రి పయ్యావుల కేశవ్ సభలో ప్రవేశపెట్టారు.

# సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే ఇంటూరి



**అమరావతి, పతాకం న్యూస్:** ఎపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం సచివాలయంలో కలిశారు. కందుకూరులోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల స్థాయిని పెంచేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 2003లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి హోదాలో 100 పడకల వైద్యశాలగా మార్చిన సంగతిని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తుచేశారు. మూడు నియోజకవర్గాలకు చెందిన రోగులు ఏరియా వైద్యశాలకు వస్తున్నారని, పెరిగిన జనాభా దృష్ట్యా... ఆసుపత్రి స్థాయిని పెంచాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. పడకల సంఖ్యను 300 కు పెంచాలని కోరారు. అలాగే పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న కందుకూరు ప్రాంతానికి, ప్రస్తుతం వైద్యశాలలో సదుపాయాలు సరిపోవటం లేదని, పడకలతో పాటు ఇతర సౌకర్యాలు కూడా కల్పించాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలను ముఖ్యమంత్రికి అందించారు. ఎమ్మెల్యే విజ్ఞప్తికి సిఎం చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని, త్వరలోనే ఆసుపత్రి స్థాయిని పెంచేలా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్ .. ఐదుగురు మావోయిస్టులు మృతి



**ఛత్తీస్‌గఢ్:** ఛత్తీస్‌గఢ్ అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. తెలంగాణ సరిహద్దులోని దట్టమైన అటవీ ప్రాంతమైన కర్రెగుట్టలో గురువారం ఉదయం భారీ ఎన్‌కౌంటర్ జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు మరణించారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అన్నారు. మావోయిస్టు నేత దేవ్ జీ లక్ష్యంగా భద్రతా దళాలు కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. ఈ ఎన్‌కౌంటర్‌లో పలువురు మావోయిస్టు కీలక నేతలు మరణించినట్లు సమాచారం.

# పీఎం జన్మన్ హౌసింగ్ లబ్ధిదారులకు రూ.లక్ష జమ చేయాలి




**డుంబ్రిగుడ, పతాకం న్యూస్:** పీఎం జన్మన్ హౌసింగ్ లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన లక్ష రూపాయలు వెంటనే జమ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి సూర్యనారాయణ డిమాండ్ చేశారు. 2.0 లో సర్వే చేసిన ఆదివాసులకు ఇల్లు మంజూరు చేసి నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు. డుంబ్రిగుడ మండల కేంద్రంలో జిల్లా ఉపాధ్యక్షులు టి సూర్యనారాయణ అధ్యక్షతన గురువారం ఆదివాసీ గిరిజన సంఘం సమావేశం జరిగింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, రాష్ట్రపతి ద్రౌపతి ముర్మ జోక్యంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పీఎం జన్మన్ హౌసింగ్ ఇల్లు నిర్మాణం అల్లూరి సీతారామరాజు జిల్లాలో 2025 డిసెంబర్ 31 నాటికీ పూర్తి కాలేదని ఆదివాసి గిరిజన సంఘం అధ్యక్షులు టి.సూర్యనారాయణ బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో ఇళ్ల నిర్మాణం నిలిచిపోయిందని, తక్షణమే బకాయి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ.. అల్లూరి సీతారామరాజు జిల్లా 11 మండలాలు పరిధిలో ఆదిమ జాతి గిరిజనులకు సుమారు 28,691 పీఎం జన్మన్ హౌసింగ్ ఇళ్లు మంజూరు అయ్యాయి, కానీ పూర్తి స్థాయిలో బిల్లులు రాకపోవడంతో ఇళు మొండి గోడలతో మిగిలాయని అన్నారు. రాష్ట ప్రభుత్వం పివిటీజీలకు అదనంగా పెంచిన లక్ష రూపాయలు ఒక్కరికి కూడా నేటికీ చెల్లించలేదని అన్నారు. పివిటీజీలు నివసిస్తున్న 1650 గ్రామాల్లో హౌసింగ్ తో పాటు 11 రకాల అభివఅద్ధి పనులు పూర్తిస్థాయిలో జరగలేదని, 2.0 లో సర్వే చేసిన ఆదివాసులకు నేటికీ ఇల్లులు మంజూరు చేయకపోవడం ఆదివాసులకు అన్యాయమని మండిపడ్డారు. ఇల్లులు మంజూరు చేసి నిర్మాణపనులు ప్రారంభించాలని, పీఎం జన్మన్ హౌసింగ్ ఇల్లు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన లక్ష రూపాయలు వెంటనే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. 2.0 సర్వే చేసిన ఆదివాసులకు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఫిబ్రవరి 27న చలో పాడేరు ఐటిడిఏ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు సత్యనారాయణ మండల నాయకులు మోహన్ దాస్ , రామ్మూర్తి, భువనేశ్వరావు, మహేష్, శ్రీను వసంత్ కుమార్ పాల్గొన్నారు.

# అల్లూరు జిల్లా ఎస్పీ ఎదుట ఛత్తీస్‌గఢ్ మావోయిస్టులు లొంగుబాటు




**పాడేరు, పతాకం న్యూస్:** ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్ డివిజనల్ కమిటీకి చెందిన ఇద్దరు మావోయిస్టులు తమ ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోయారని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ తెలిపారు. ఆయన పాడేరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జనజీవన స్రవంతిలో కలిసేందుకు అబూజ్‌మడ్ డివిజనల్ ఏరియా కమిటీ సభ్యురాలు కడితి హిడ్మే అలియాస్ అంజు కరుణ, ఏరియా కమిటీ సభ్యుడు బడ్సే భీమా అలియాస్ మనీష్‌లు లొంగిపోయారన్నారు. వారు మావోయిస్టు పార్టీలో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించారన్నారు. కడితి హిడ్మే 2010లో బాలల సంఘంలో చేరిందన్నారు. 2012లో దళ సభ్యురాలిగా, 2017 నుంచి 2019 వరకు డీవీసీగా డాక్టర్స్ టీమ్‌లో, 2020లో ఏరియా కమిటీ మెంబర్‌గా, 2024లో పదోన్నతి పొంది డీసీఎంగా పనిచేసిందన్నారు. భద్రత బలగాలతో మూడుసార్లు ఎదురుకాల్పుల్లో ఆమె పాల్గొన్నదని ఆయన చెప్పారు. అలాగే బడ్సే భీమా 2018లో గ్రామ మిలటరీ మెంబర్‌గా చేరి 2018 నుంచి 2024 వరకూ దళ సభ్యుడిగా, 2024లో ఏరియా కమిటీ సభ్యుడిగా పదోన్నతి పొందాడన్నారు. మావోయిస్టు పార్టీ బలహీనపడడం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉపాధి అవకాశాలు, ప్రోత్సాహకాలు ఇస్తుండడంతో వీరిద్దరూ స్వచ్ఛందంగా లొంగిపోయారని ఎస్పీ తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులు ప్రభుత్వ సంక్షేమ, పునరావాస పథకాలను పూర్తిగా వినియోగించుకొని శాంతియుత జీవనం గడపాలని ఆయన కోరారు. ఇతర మావోయిస్టు క్యాడర్లు సమీప పోలీస్ స్టేషన్లలో స్వచ్ఛందంగా లేదా కుటుంబ సభ్యుల ద్వారా లొంగిపోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# బస్ షెల్టర్లు లేక అవస్థలు



**కొయ్యూరు, పతాకం న్యూస్:** జాతీయ రహదారి 516–ఈ నిర్మాణం వలన మండల వాసులకు బస్ షెల్టర్లు లేకుండాపోయాయి. సుమారు 50 గ్రామాలకు ప్రధాన కూడళ్లు అయిన కాకరపాడు, ఎం.మాకవరం పంచాయతీ నడింపాలెం బస్ షెల్టర్లు లేక గత మూడేళ్లుగా బస్సు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడేళ్ల క్రితం జాతీయ రహదారి 516–ఈ నిర్మాణంలో భాగంగా బస్ షెల్టర్లను తొలగించారు. కాకరపాడు కూడలి నుంచే నర్సీపట్నం, కొయ్యూరు, ఏలేశ్వరం, రాజమహేంద్రవరం, రంప చోడవరం, మారేడుమిల్లి, తదితర సుదూర ప్రాంతాలతో పాటు మండలానికి చెందిన 10 పంచాయతీలకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే ఎం.మాకవరం పంచాయతీ పరిధి 10 గ్రామాలకు నడింపాలెం కూడలి నుంచి వెళుతుంటారు. గతంలో ఇక్కడ బస్ షెల్టర్లు ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఉండేవి కాదు. అయితే మూడేళ్ల క్రితం జాతీయ రహదారి నిర్మాణం కోసం ఈ షెల్టర్లను తొలగించడంతో ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు. ఎండైనా, వానైనా ఇబ్బందులు పడుతూ బస్సుల కోసం వేచి ఉండాల్సి వస్తోంది. కాగా జాతీయ రహదారి నిర్మాణ సమయంలో బస్ షెల్టర్లను తొలగించిన కాంట్రాక్టర్ ఆ తరువాత పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. దీనిపై కలెక్టర్ స్పందించి బస్ షెల్టర్ల పునఃనిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

# అధ్వానంగా బొర్రా గుహలకు వెళ్లే రోడ్డు

## బగ్మారవలస– దొరగూడ మార్గంలో గోతులు



**అనంతగిరి, పతాకం న్యూస్:** మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలకు వెళ్లే రోడ్డంతా అధ్వానంగా తయారైంది. ములియగుడ నుంచి బగ్మారవలస, దొరగూడ, గేటువలస, బొర్రా వరకు రోడ్డంతా ఎక్కడికక్కడ గోతులతో దారుణంగా ఉంది. దీంతో కోనాపురం, బొర్రా పంచాయతీల్లోని సుమారు 20 గ్రామాల గిరిజనులతో పాటు పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు.బొర్రా గుహలను తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలతో పాటు దేశవిదేశీ పర్యాటకులు కూడా అధిక సంఖ్యలో వస్తుంటారు. ఎక్కువ మంది వాహనాల్లోనే వస్తారు. అయితే దొరగూడ సమీపంలోని మలుపు వద్ద ఏర్పడిన గొయ్యి వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సుమారు ఐదేళ్లుగా బొర్రా రోడ్డుకు మరమ్మతులు, నిర్వహణ లేకపోవడం వల్ల పలుచోట్ల రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. మరికొన్నిచోట్ల భారీగా గోతులు ఏర్పడ్డాయి. అయినా ఆర్అండ్‌బీ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో పలు గ్రామాల ప్రజలతో పాటు పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. ములియగుడ నుంచి బొర్రా గుహలు వరకు సుమారు ఏడు కిలోమీటర్లు ప్రయాణం ఉంటుంది. బగ్మారవలస, దొరగుడ, హోటళ్లు సమీపంలోని రోడ్డుపై గోతులు ఏర్పడ్డాయి. రైల్వేగేటు సమీపంలో రక్షణగోడ కూలిపోవడంతో వాహనాలు అదుపుతప్పితే సుమారు 80 అడుగుల లోయలోకి దూసుపోయే ప్రమాదం ఉంది. గతంలో ఇక్కడ రెండు ప్రమాదాలు జరిగాయి. వ్యాన్ బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. దానికి ముందు లారీ బోల్తాపడిన ఘటనలో డ్రైవర్‌కు కాలు విరిగిపోయింది. బొర్రా, కోనాపురం పంచాయతీల పరిధిలో గల బొర్రా, పెద్దూరు, ఎగువమామిడి, జీరుగెడ్డ, నీనిమామిడి, పూలుగుడ, కొయిటిగూడ, కరాయిగుడ, చప్పాడి, కోనాపురం, అతిమాల, కితలింగి, బొండ్యగూడ, లిడ్డంగి, సారాగూడ తదితర గ్రామాల ప్రజలు ములియగుడ, బొర్రా గేటువలస మీదుగా ఆయా గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ప్రస్తుతం అధ్వానంగా ఉన్న రోడ్డు వలన సమస్యలను ఎదుర్కొంటున్నారు. ములియగుడ– బొర్రా వరకు ఉన్న రోడ్డు ఆర్అండ్‌బీ శాఖ పరిధిలోకి వస్తుంది. అయితే నిర్వహణ లోపం వల్ల రోడ్డంతా అధ్వానంగా తయారైంది. కనీసం మరమ్మతులపై దృష్టి సారించకపోవడంతో ఈ మార్గం ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు బొర్రా రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# ఏఐలో ఏడేళ్లలో రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు పెడతాం: ముకేశ్ అంబానీ




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ప్రముఖ రిలియన్స్ ఇండ్రస్ట్రీస్ గ్రూప్ పెట్టుబడులకు సంబంధించి మరో భారీ ప్రకటన చేసింది. ఏఐ విస్తరణ కోసం రిలియన్స్, జియో కలిసి రాబోయే ఏడు సంవత్సరాల్లో దాదాపు 10 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించింది. మొబైల్ డేటా మాదిరిగానే కృత్రిమ మేధలోనూ సరికొత్త విప్లవాన్ని తీసుకొస్తామని తెలిపింది. దిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సదస్సులో పాల్గొన్న రిలియన్ ఇండస్ట్రీస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముకేశ్ అంబానీ ఈ మేరకు ప్రకటన చేశారు. ఏఐలో ఇంకా బెస్ట్ రావాల్సి ఉందని సుసంపన్న యుగానికి ఆర్టిఫిషియల్ ఇంటెలీజెన్స్ నాంది పలుకుతుందని అంబానీ స్పష్టం చేశారు. 'ఇది శక్తిని కొందరి చేతుల్లోనే కేంద్రీకృతం చేస్తుందా? లేదా ప్రజలందరికీ అవకాశం కల్పిస్తుందా అనే చర్చ నడుస్తోంది' అని ముకేశ్ పేర్కొన్నారు. ఏఐలో విప్లవం తీసుకొచ్చేందుకు పని చేస్తామని తెలిపారు. ఇది ఊహాజనిత పెట్టుబడి కాదని, దేశ నిర్మాణానికి ఈ వ్యయం ఉపయోగపడనుందని ముకేశ్ వెల్లడించారు. భారత్‌ను ఇంటర్నెట్ యుగం నుంచి ఇంటెలిజెన్స్ యుగానికి మార్చుతామని అంబానీ ప్రకటించారు. ఇప్పటికే జియో, భారత్‌ను ఇంటర్నెట్ యుగానికి చేరవేసిందని, రాబోయే రోజుల్లో ఇంటెలిజెన్స్ యుగానికి అనుసంధానిస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా, భారత్‌లో ప్రతి పౌరుడికి ఆర్థిక వ్యవస్థలోని ప్రతిరంగానికి, సామాజిక అభివృద్ధిలో ప్రతి కోణానికి ప్రతి సేవకు ఏఐ సాంకేతికతను విస్తరిస్తామని చెప్పారు. రాబోయే రోజుల్లో జియో ఇంటలీజెన్స్?, భారతదేశ సావరిన్ కంప్యూటర్ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తుందన్నారు. గిగివాట్ల సామర్థ్యంతో ఏఐ రెడీ డేటా సెంటర్ల నిర్మాణం ఇప్పటికే ప్రారంభమైందని అంబానీ తెలిపారు. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో బహుళ గిగావాట్ డేటా సెంటర్ల పనులు కొనసాగుతున్నాయని ముకేశ్ చెప్పారు. 2026 చివరి ఆరు నెలల్లో 120 మెగావాట్ల సామర్థ్యం అమల్లోకి వస్తుందన్నారు. మరోవైపు, కచ్, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల్లో సౌరశక్తి ఆధారంగా 10 గిగావాట్ల వరకు గ్రీన్ పవర్ సిద్ధంగా ఉందని చెప్పారు. స్వంతంగా విద్యుత్ వనరులు ఉండటం వల్ల ఏఐ మౌలిక వసతుల ఖర్చులు తగ్గుతాయని ముకేశ్? అభిప్రాయపడ్డారు. దీంతో పాటు 'దేశవ్యాప్త ఎడ్జ్ కంప్యూటింగ్ నెట్‌వర్క్' గురించి కూడా ఆయన ప్రస్తావించారు. జియో నెట్‌వర్క్‌తో తక్కువ సమయంలో, అతి తక్కువ ఖర్చుతో ఏఐ సేవలు అందిస్తామని అంబానీ పేర్కొన్నారు. ప్రజలు నివసించే, చదివే, పనిచేసే ప్రదేశాలకు దగ్గరగా ఇంటెలిజెన్స్‌ను తీసుకువెళ్తామన్నారు.

# విద్యార్థినులకు వేధింపులపై విచారణ




**ఎచ్చెర్ల, పతాకం న్యూస్:** ఆర్జీ యూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో ఇంజనీరింగ్ విద్యార్థినులను కొంతమంది అధ్యాపక, అధ్యా పకేతర సిబ్బంది వేధిస్తున్నారంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు అంతర్గత కమిటీ విచారణ చేపట్టింది. విద్యార్థినులను కొంతమంది అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది వేధింపులకు పాల్పడుతున్నారంటూ గతేడాది డిసెంబరులో ఉన్నతాధికారులకు ఈ–మెయిల్‌లో ఫిర్యాదు వచ్చింది. దీనిపై పెద్ద దుమారం రేగింది. ఈ వ్యహారంపై ఇప్పటికే రెండుసార్లు ఉన్నతాధి కారులు విచారణ చేపట్టారు. తాజాగా, నూజివీడు నుంచి వచ్చిన ఆరు గురు సభ్యులతో కూడిన అంతర్గత కమిటీ ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌ను సందర్శిం చింది. వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న సిబ్బందిని ఈ కమిటీ సభ్య లు విచారిస్తున్నారు. ఈ కమిటీలో నూజివీడు క్యాంపస్‌కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రావణ కనకకుమారి, నాగార్జునదేవి, కాంట్రాక్ట్ సిబ్బంది దుర్గాభవాని, సురేష్‌బాబు, రాజేష్, వేణుగోపాల్‌లు ఉన్నారు. ఈ కమిటీ రెండు రోజుల పాటు క్యాంపస్‌లో విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నారు.గతేడాది డిసెంబరు 16న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఈ క్యాంపస్‌ను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. బాలికలు, మహిళల రక్షణ కోసం ప్రత్యేకించి పోక్సో, పోష్ చట్టాలపై అవగాహన కల్పించి, విద్యార్థినులకు భరోసా కల్పించారు. అదే రోజు ఆర్జీయూకేటీ చాన్సలర్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి క్యాంపస్‌ను సందర్శించి విద్యార్థినులు, అధికారులతో వేర్వేరుగా మాట్లాడారు.నూజివీడు క్యాంపస్ ఈఈఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రావణ కనక కుమారి, న్యాయవాది పద్మజ, హెచ్‌సీ టి.సరితతో కూడిన కమిటీ అప్పట్లో రెండు రోజుల పాటు క్యాంపస్‌లో ఉండి విద్యార్థినుల నుంచి వేర్వేరుగా వివరాలు సేకరించారు. విద్యార్థినులు, సిబ్బంది నుంచి వేర్వేరుగా సమాచారం సేకరించారు. విద్యార్థినులతో ప్రత్యేకంగా మాట్లాడి క్యాంపస్‌లో ఏమి జరుగుతుందో వివరాలు తెలుసుకున్నారు.

# పకడ్బందీగా టెన్త్, ఇంటర్ పరీక్షలు నిర్వహించాలి: కలెక్టర్ దినేశ్‌కుమార్



**పాడేరు, పతాకం న్యూస్:** ఉమ్మడి అల్లూరి సీతారామరాజు జిల్లాలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. ఈ నెల 23 నుంచి ఇంటర్మీడియట్, వచ్చే నెల 16 నుంచి పదవ తరగతి వార్షిక పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై ఎస్పీ అమిత్‌బర్దార్, జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ కె.రామకృష్ణారావులతో కలిసి కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అల్లూరి జిల్లాలో 47 కేంద్రాల్లో రెగ్యులర్ విద్యార్థులు 7,299 మంది, ప్రైవేటు విద్యార్థులు 505, సార్వత్రిక విద్యార్థులు 1,003 మంది, పోలవరం జిల్లాలో మొత్తం 32 కేంద్రాల్లో రెగ్యులర్ విద్యార్థులు 4,158 మంది, ప్రైవేటు విద్యార్థులు 26, సార్వత్రిక విద్యార్థులు 414 మంది పదవ తరగతి పరీక్షలకు హాజరవుతారన్నారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఇంటర్ రెగ్యులర్ విద్యార్థులు 1,225 మంది, సార్వత్రిక విద్యార్థులు 582 కలిపి.. మొత్తం 1,807 మంది విద్యార్థులు ఇంటర్ వార్షిక పరీక్షల్లో పాల్గొంటారని కలెక్టర్ పేర్కొన్నారు. పోలవరం జిల్లాలో రెగ్యులర్ విద్యార్థులు 800 మంది, సార్వత్రిక విద్యార్థులు 608 మంది.. మొత్తం 1,408 మంది ఇంటర్ వార్షిక పరీక్షలు రాస్తారన్నారు. అలాగే టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షలు జరిగే కేంద్రాల వద్ద విధిగా 144 సెక్షన్‌ను అమలు చేయాలని, మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా చూడాలన్నారు. పరీక్షల నిర్వహణలో ఎవరికీ ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రశ్న, జవాబు పత్రాల రాకపోకలకు ఎటువంటి సమస్యలు ఏర్పడకుండా పోలీసు బందోబస్తు చేపట్టాలని, పరీక్షా కేంద్రాల్లోనూ నిఘాతో పాటు బందోబస్తు పక్కాగా ఉండాలని కలెక్టర్ సూచించారు. సమస్యాత్మక పరీక్షా కేంద్రాలకు అదనపు భద్రతా ఏర్పాట్లు చేయాలని, అందరి సమన్వయంతో పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ ఏవీ స్వామినాయుడు, డీఎస్పీ అభిషేక్, పలు శాఖలకు చెందిన జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# పర్యాటకంగా రాష్ట్రాభివృద్ధి : దుర్గేష్



**విజయవాడ, పతాకం న్యూస్:** రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిటిడిసి) ఏర్పాటై 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ బందర్ రోడ్డులోని పర్యాటశాఖ డివిజనల్ కార్యాలయం వద్ద నుంచి పున్నమి ఘాట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. భవానీపురంలోని బెరంపార్క్‌లో జరిగిన వేడుకల్లో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. గత 18 నెలల్లో పర్యాటక రంగం గణనీయమైన అభివృద్ధిని సాధించిందన్నారు. సుమారు రూ.20 వేల కోట్ల పెట్టుబడులు, 1.22 లక్షల ఉద్యోగాల కల్పనతో రాష్ట్ర పర్యాటక రంగం ముందంజలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిటిడిసి చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజరు జైన్, విసి అండ్ ఎండి ఆమ్రపాలి కాటా, ఇడి (ఆపరేషన్స్) ఏఏఎల్ పద్మావతి, ఎం.శేషగిరి (ప్రాజెక్ట్స్) పాల్గొన్నారు.

## జిల్లాలో ప్రత్యేకంగా సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్





**విజయనగరం, పతాకం న్యూస్:** సైబర్ నేరాలు, మోసాలకు సామాన్యులే కాదు విద్యావంతులు, ఉన్నత వర్గాల వారు బాధితులవుతున్నారు. రోజురోజుకూ మోసాల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. వీటిని కట్టడి చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. జిల్లాకు ఒక సైబర్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని బడ్జెట్‌లో ప్రకటించింది. జిల్లాలో కొత్త తరహాలో మోసాలు జరుగుతున్నాయి. ఆన్‌లైన్ నేరగాళ్ల ఆగడాలు ఎప్పటికప్పుడే వెలుగుచూస్తున్నాయి. భయపెట్టి లేదంటే ఆకర్షించే వ్యూహాలు పన్నుతూ ప్రలోభాలకు దిగుతున్నారు. లైంగిక ఆరోపణలు, మానవ అక్రమ రవాణా, ఆన్‌లైన్ కేసులు, డిజిటల్ అరెస్టు పేరిట ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులను భయపెడుతున్నారు. ఏదో చోట ఈతరహా నేరాలు వెలుగు చూస్తున్నాయి. సైబర్ నేరగాళ్లకు ఏమాత్రం అవకాశం దొరికినా ఖాతాలను ఖాళీ చేసేందుకు సిద్ధపడుతున్నారు. నాలుగు రోజుల కిందట జిల్లాకు చెందిన ప్రముఖ వ్యాపార వేత్త, నారాయణం గ్రూప్ అధినేత నారాయణం శ్రీనివాస్ సైబర్ నేరగాళ్ల బారిన పడి రూ.27 లక్షలు పోగొట్టుకున్నారు. గడిచిన మూడేళ్లలో సైబర్ నేరాలతో దాదాపు రూ.10 కోట్ల వరకూ కొల్లగొట్టారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇటీవల స్మార్ట్ ఫోన్ల వినియోగం అధికమైంది. వీటిని ఆసరాగా చేసుకొని నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఆన్‌లైన్ లింకుల ద్వారా మోసాలకు పాల్పడుతున్నారు. సైబర్ నేరాలకు సంబంధించి జిల్లాలో 2023లో 108 కేసులు నమోదుకాగా రూ.4.19 కోట్లు కోల్పోయారు. కానీ అందులో ఫ్రీజింగ్ చేసింది కేవలం రూ.11 లక్షలు మాత్రమే.. 2024లో 107 కేసులకుగాను.. కోల్పోయిన నగదు రూ.6.65 కోట్లుకాగా ఫ్రీజింగ్ చేసింది కేవలం రూ.88 లక్షలు మాత్రమే. అయితే 2025లో కొంత వరకూ తగ్గుముఖం పట్టాయి. 50 వరకూ నమోదయ్యాయి. ఇప్పటివరకూ శాంతిభద్రతలు, ట్రాఫిక్, మెరైన్ పోలీస్‌స్టేషన్లు ఉండగా.. ఇప్పుడు సైబర్ నేరాలకు ప్రత్యేకంగా పోలీస్ స్టేషన్ ఏర్పాటుకానుండడం శుభ పరిణామం. జిల్లాలో చాలామంది ఫేస్‌బుక్ ఖాతాలు హ్యాక్ అవుతున్నాయి. కొందరే గుర్తించగలుగు తున్నారు. 'మిత్రులారా నా ఫేస్‌బుక్ హ్యాక్ అయ్యింది. నా పేరిట ఎవరో నగదు అడుగుతున్నారు. దయచేసి ఎవరూ నగదు పంపించకండి' అంటూ వాట్సాప్ గ్రూపులు, స్టేటస్‌లో పెట్టుకోవాల్సి రావడం నిత్యకృత్యమైంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్న వేళ కొందరు సైబర్ నేరగాళ్లు సరికొత్తగా సవాల్ విసురుతున్నారు. వారు వీరూ అన్న తేడా లేదు. పోలీస్ అధికారులు మొదలు వ్యాపారులు, ఉద్యోగులు, అన్నివర్గాల ప్రజలపై గురిపెడుతున్నారు. సోషల్ మీడియాలో నిత్యం ఏదో ఒక పోస్టు పెడుతుండేవారి ఖాతాలను అంతగా హ్యాక్ చేయడం లేదు. యాక్టివ్ లేని వారిపైనే గురిపెడుతున్నారు. వీరైతే ఎప్పుడో ఒక ఫొటో పెట్టి వదిలేస్తుంటారు. వారి అకౌంట్‌ను హ్యాక్‌చేసినా వారు చూసేసరికి చాలా సమయం పడుతుంది. అందుకే ఇటువంటి వారి ఖాతాలనే సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేస్తున్నట్టు తెలుస్తోంది. స్నేహితులకు నగదు అడగడం, వారు వెనువెంటనే అకౌంట్‌లో జమచేయడం, తరువాత బాధితుడికి తెలిసినా ఏం చేయలేని నిస్సహాయ స్థితిలోకి వెళ్లడం ఇటీవల పరిపాటిగా మారింది. అయితే సైబర్ నేరాలకు చెక్ చెప్పే విధంగా సైబర్ పోలీస్‌స్టేషన్ రానుండడం మాత్రం శుభవార్తే.

## బయోమెడికల్ వ్యర్థాలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



**విజయనగరం, పతాకం న్యూస్:** జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య ఆస్పత్రులు బయోమెడికల్ వ్యర్థాలు నిర్వహణ నిబంధనలను పాటించాలని, ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహిం చినా సంబంధిత ఆసుపత్రులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రామ సుందర్ రెడ్డి హెచ్చరించారు. విజయన గరంలో కాలుష్య నియంత్రణ మండలి, ఆరోగ్య శాఖ అధికారులతో సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఆసుపత్రి వ్యర్థాల నిర్వహణ అత్యంత కీలకమైన ప్రక్రియ అని ప్రజారోగ్యానికి భంగం కలగకుండా శాస్త్రీయపద్ధతిలో నిర్ణీత సమయంలోగా తరలించాలన్నారు. ప్రతి ఆసుప త్రిలో రెడ్, ఎల్లో, బ్లూ, వైట్ రంగులు కోడింగ్ బ్యాగులను ఉపయోగించి, ఇంజక్షన్ సూదులు, ప్రతి గ్లౌజ్, శరీరవ్యర్థాలను తప్పనిసరిగా వేరు చేయా లని సూచించారు. జిల్లాలోని 496 ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు పశుసంవర్ధక ఆసుపత్రుల నుం చి కూడా క్రమం తప్పకుండా వ్యర్థాల సేకరణజరగాలని ఆదేశించారు. సేకరిం చిన వ్యర్థాలను 48 గంటల గడువులోగా తరలించాలని, ఎక్కడా బయట కనిపించకూడదని తెలిపారు. ప్రతి ఆసు పత్రి, క్లినిక్ ల్యాబ్ తమ వద్ద ఉత్పత్తి అయ్యే వ్యర్థాల వివరాలను బయో మెడికల్ వేస్టు మేనేజ్‌మెంట్ యాప్‌లో ప్రతిరోజు నమోదు చేయాలని ఆదేశించారు. డేటా ఎంట్రీ చేయని సంస్థలపై చర్యలు తీసుకోవాలని, వెంటనే నోటీసులు జారీచేయాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటి నుంచి బయోమెడికల్ వ్యర్థాలను సైతం సేకరించి, సరైన పద్ధతిలో వాటిని తరలించాలని కమిషనర్లకు సూచించా రు. వ్యర్థాలకు బయటపడేసే ఆసుపత్రులపై నిఘాపెట్టాలన్నారు. కార్య క్రమంలోని కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సరిత, జిల్లా వైద్యాధికారి జీవనరాణి పాల్గొన్నారు.

## ఇళ్ల వద్దకే సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు



**గుర్ల, పతాకం న్యూస్:** రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఇళ్ల వద్దకే సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేస్తు న్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు తెలిపారు. ఆనందపురానికి చెందిన చిట్టి సత్యానికి మం జూరైన రూ.58,550లు విలువైన చెక్కు, బంటుపల్లికి చెందిన మజ్జి సత్యనారాయణ కుమా రుడు కుషాల్‌నందన్‌కు మంజూరైన రూ.లక్షా 18 వేలచెక్కును బాధితుల ఇళ్లకు వెళ్లి అందజేశారు.ఆయన వెంట వి.సన్యాసినా యుడు, మహేశ్వరరావు, నాయకులు కిరణ్‌కుమార్, పి.అప్పల నాయుడు, శ్రీనివాసరావు, సన్యాసినాయుడు ఉన్నారు

# వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి



**విజయనగరం, పతాకం న్యూస్:** వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలను తీసుకున్నామని కమిషనర్ బాలస్వామి అన్నారు. ఈ మేరకు గురువారం నెల్లిమర్ల హెడ్ వాటర్ వర్క్స్ ప్రాంతానికి వెళ్లి అక్కడ పరిస్థితులను సమీక్షించారు. ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందితో పంప్ హౌస్ వద్దకు చేరుకొని నీటి సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. జనరేటర్లు,పంపింగ్ యంత్రాల పనితీరును గమనించారు. ఎమ్.ఎల్.డి.ల సామర్థ్యం, నగరానికి నీటి పంపిణీ జరిగే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో నగరవాసులకు తాగునీటి కి ఇబ్బందులు లేకుండా అన్ని అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. అవసరమైతే అదనపు జలాలు రప్పించి, తాగునీటిని ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అయితే ఈ సంవత్సరం నదీ జలాలు ఆశాజనకంగా ఉండడంతో తీవ్రమైన ప్రభావం ఉండబోతున్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వేసవిలో తాగునీటి కోసం ప్రజలు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎం.ఈ.ప్రసాదు, డిఈ నరసింహారెడ్డి, ఏఈలు పాల్గొన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షణ్ పక్కాగా అమలు చేయండి



**పార్వతీపురం, పతాకం న్యూస్:** పార్వతీపురం మున్సిపాలిటీలో స్వచ్ఛ సర్వేక్షణ్‌ను పక్కాగా అమలు జరిగేలా చూడాలని సబ్ కలెక్టర్ వైశాలి అన్నారు. పట్టణంలోని 18, 19వ వార్డుల్లో పారిశుధ్య నిర్వహణను ఆమె పరిశీలించారు. కోవెల వీధి, హరిజన వీధి, గెడ్డ వీధిల్లో పారిశుధ్యంపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పార్వతీపురం మున్సి పాలిటీని రాష్ట్రంలోనే కాదు, దేశంలోనే కాలుష్య రహిత ఉత్తమ మున్సి పాలిటీగా నిలిపేందుకు ప్రజారోగ్యశాఖ అధికారులు, సిబ్బంది శ్రమిం చాల్సిన అవసరం ఉందన్నారు. పారిశుధ్య నిర్వహణలో ఉత్తమ మున్సిపా లిటీగా నిలిపేందుకు ఇప్పటి నుంచి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాల్సిన బాధ్యత ఉందని మున్సి పల్ కమిషనర్ పావనిని ఉద్దేశించి అన్నారు.

## నగరాభివృద్ధికి మరింత కృషి

### కమిషనర్ బాలస్వామి




**విజయనగరం, పతాకం న్యూస్:** నగర అభివృద్ధికి మరింత కృషి చేస్తామని కమిషనర్ బాలస్వామి అన్నారు. నగర పాలక సంస్థ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశం లో 18 అంశాల్లో 17 ఆమోదించారు. ఎజెండాలో ప్రధానంగా పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. ప్రధానంగా కుక్కలు నియంత్రణ విషయంలో నిధులు చెల్లించే అంశంపై ఫ్లోర్ లీడర్ రాజేష్ మాట్లాడుతూ కుక్కలన్నింటినీ తమ వార్డులో పెట్టేస్తున్నారని, పిచ్చికుక్కలు ఇష్టారాజ్యంగా తిరుగుతుండడంతో ప్రజలు భయపడుతున్నారని అన్నారు. పిచ్చి కుక్కలకు ఒక షెడ్ ఏర్పాటు చేసి వాటిని అదుపులోకి తీసుకొని ఇబ్బంది లేకుండా చూసేలా ఎజెండాను ఆమోదించాలని కోరారు. కమిషనర్ సమాధానంతో ఈ అంశాన్ని స్టాండింగ్ కమిటి ఆమోదించింది. అభివృద్ధి పనుల టెండర్లు పాడిన రెండు అంశాల్లో ప్రధానంగా రూ.25లక్షలు దాటి చేపట్టనున్న అభివృద్ధి పనులకు ముందుగా ధరావత్తు కట్టించుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను కోరారు. రాజ్ కుమార్ కాంట్రాక్టర్ కేవలం గ్రాంట్ వర్క్ లు మాత్రమే చేస్తారు తప్ప జనరల్ ఫండ్ వర్కులు ఎందుకు చేయరని, అలాంటి వాటిని గతంలో బ్లాక్ లిస్టులో పెట్టాలని కోరినట్లు తెలిపారు. 36 శాతం తక్కువకు వర్క్ టెండర్ వేశారంటే ఆ పనిలో నాణ్యతను ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించాలని కోరారు. అధికారులను బయపెట్టే విధంగా ఎవరు వ్యవహరిస్తే మేము చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. రూ70లక్షలతో చేపట్టిన నగర పాలక సంస్థ కార్యాలయం రెన్నోవేషన్ పనులను కమిషనర్ పరిశీలించాలని కోరారు. అనంతరం ఎజెండాలో మిగిలిన అంశాలను ఆమోదించారు. నగర పాలక సంస్థ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని, వాటిని కాపాడు కునేందుకు ఒక లాయర్‌ను ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు. నగరాభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తాం ఫ్లోర్ లీడర్ రాజేష్ మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో తమ పాలకవర్గంలో రాష్ట్రంలో ఏ నగర పాలక సంస్థ చేపట్టని విధంగా రూ.250 కోట్లతో నగరాభివృద్ధి, సుందరీకరణ పనులు చేపట్టామని, తెలిపారు. వీటిని కాపాడుకుంటూ మరింత సుందరంగా నగరాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని నూతన కమిషనర్‌ను కోరారు. నగరంలో ఇంకా ఆదాయం పెరుగుదలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. కమిషనర్ మాట్లాడుతూ నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామన్నారు. నగరంలో రెండు ప్రాంతాల్లో చెత్త వేసేందుకు రెండు ఎకరాలు గుర్తించామని, స్టాడింగ్ కమిటీ సూచనలు పరిగణనలోకి తీసుకొని అమలు చేస్తామని తెలిపారు. టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేస్తామని, దానికి ఫోన్ చేసి రూ.500 కడితే ట్రాక్టర్‌తో తామే చెత్త తొలగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.సమావేశం లో సభ్యులు సుంకరి నారాయణస్వామి, రేగాన రూపాదేవి, అసిస్టెంట్ కమీషనర్ అప్పలరాజు, అన్ని శాఖలు అధికారులు పాల్గొన్నారు.

## 'వీఆర్‌ఏలకు వేతనాలు పెంచాలి'




**బెలగాం, పతాకం న్యూస్:** వీఆర్‌ఏలకు వేతనాలు పెంచాలని సీఐటీయూ నాయకుడు వై.మన్మథరావు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాల యం ఎదుట వీఆర్‌ఏలు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మన్మథరావు మాట్లాడుతూ వీఆర్‌ఏలకు 8 ఏళ్లుగా జీతాలు పెరగలేదన్నారు. తక్షణమే వారికి పే స్కేల్ వేతనాలు అమలు చేయాలన్నారు. అర్హులైన వీఆర్‌ఏలకు వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలన్నారు. నైట్ వాచ్‌మెన్, అటెండర్ పోస్టులను 70 శాతం మందికి కేటాయించాలన్నారు. ఆందోళనలో సీఐటీయూ నాయకులు వెంకటరమణ, బి.వి.రమణ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కోర్టు భవనాలకు నిధులు మంజూరుచేయాలి



**కొత్తవలస, పతాకం న్యూస్:** శిథిలావస్థలో ఉన్న కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాల కూల్చి వేతకు అనుమతి ఇవ్వడంతోపాటు నూతన భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరుచేయాలని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కోరారు. ఈమేరకు రాష్ట్రప్రభుత్వ న్యాయశాఖకార్యదర్శి జి.ప్రతిభాదేవికి వెలగపూడిలోని సచివాలయంలోని ఆమె కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం సరైన కోర్టు భవనం లేకపోవడంతో ఇబ్బందులుపడుతుండడంతో ప్రతిపాదనలను పరిశీలించి నూతనంగా సింగిల్ కోర్టు భవనం నిర్మాణానికి అవసరమైన అనుమతులను మంజూరుచేయాలని కోరినట్లు తెలిపారు.

## ఇది బాబు భజన..
## అన్నీ తప్పుడు లెక్కలే

(మొదటిపేజీ తరువాయి)


హామీలను మూడు బడ్జెట్‌లలోనూ గాలికి వదిలేసి అన్ని వర్గాల ప్రజలను వెన్నుపోటు పొడుస్తున్నారని ఆరోపించారు. ఆర్థిక లెక్కలన్నీ తప్పుల తడకలేనని జగన్ అంకెలతో సహా వివరించారు. 2024-25లో రూ.1.19 లక్షల కోట్ల ఆదాయం వస్తుందని చెప్పి, వాస్తవానికి రూ.94,937 కోట్లు మాత్రమే రాబట్టారని తెలిపారు. పది నెలల్లో రాష్ట్ర ఆదాయ వృద్ధి కేవలం 4.25 శాతమేనని పేర్కొన్నారు. కాగ్ రిపోర్ట్ ప్రకారం, దేశంలోని 23 రాష్ట్రాల్లో సొంత ఆదాయాల పురోగతిలో ఏపీ చివరి నుంచి రెండో స్థానంలో (22వ ర్యాంక్) ఉందని, ఇది ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో 2026-27 నాటికి ఆదాయం 45% పెరుగుతుందని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ప్రభుత్వ అసమర్థత వల్లే రాష్ట్ర ఆదాయం 'బాబు అండ్ కో' జేబుల్లోకి వెళ్తోందని, "దోచుకో.. దాచుకో.. పంచుకో" అనే విధానం అమలవుతోందని జగన్ ఆరోపించారు. అప్పుల వివరాలను బడ్జెట్‌లో చూపించకపోవడం పారదర్శకత లేకపోవడానికి నిదర్శనమన్నారు. మహిళలకు రూ.1,500, నిరుద్యోగ భృతి వంటి హామీలకు నిధుల కేటాయింపు ఏదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ ను లక్ష్యంగా చేసుకుని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజల డబ్బుతో కొలంబో, ఢిల్లీ అంటూ విమానాల్లో తిరుగుతూ క్రికెట్ మ్యాచ్ లు చూస్తూ, స్టేడియాల్లో జల్సాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. "రాత్రికి కొలంబోలో ఉంటాడు, మరుసటి రోజు ఉదయం విజయవాడలో ఉంటాడు... సాయంత్రానికి ఢిల్లీ వెళతాడు... అంతా ప్రైవేటు విమానాలే. దేశంలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు ఇలా జల్సాలు చేయడం ఎక్కడైనా ఉందా? చంద్రబాబుకు ఒక విమానం, లోకేశ్ కు ఒక విమానం, పవన్ కల్యాణ్ కు ఓ విమానం... అందరూ గాల్లోనే ఉంటారు. క్రికెట్ మ్యాచ్ చూడాలంటే కొలంబోనే వెళ్లాలా... టీవీలో చూస్తే కనపడదా... నేను కూడా టీవీలోనే చూశాను" అంటూ జగన్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

## మంత్రి లోకేశ్‌పై ఉండవల్లి ప్రశంసలు..



**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** ఏపీ మంత్రి నారా లోకేశ్‌పై మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ ప్రశంసలు కురిపించారు. కర్నూలు కోవాబన్ వలీకి మంత్రి నారా లోకేశ్ అండగా నిలవడం అభినందనీయమని కొనియాడారు. బీజేపీ అలయన్స్‌లో ఉండి ముస్లింకి లోకేశ్ అండగా నిలవడంపై అభినందించాలని పేర్కొన్నారు. రాజమండ్రిలో మీడియాతో ఉండవల్లి మాట్లాడారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి రావాల్సిన రూ.80 వేల కోట్ల కోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని సూచించారు. రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లు గడిచినా కూడా విభజన హామీలు ఇంకా అమలు కాలేదని పేర్కొన్నారు. విభజన వల్ల ఏపీకి జరిగిన అన్యాయంపై పోరాడటానికి సుప్రీంకోర్టులో ఓ అడ్వొకేట్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఉండవల్లి అరుణ్ కుమార్ కోరారు. తిరుపతి లడ్డూ అంశాన్ని రాజకీయం చేయటం మంచిది కాదన్నారు. లడ్డూ కల్తీ చేసిన వారిపై సిట్ నివేదిక ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఉన్న హెరిటేజ్, భారతి సిమెంట్స్ ప్రధాన కార్యాలయాలను అమరావతికి తీసుకురావాలని సూచించారు. వైసీపీ తరహాలోనే కూటమి ప్రభుత్వం కూడా కక్ష సాధింపు చర్యలకు వెళ్లకూడదని హితవు పలికారు. చంద్రబాబును జైల్లో పెట్టడం వల్ల జగన్‌కు నష్టమే జరిగిందని.. వైసీపీ నేతలను జైల్లో పెడితే చంద్రబాబుకు కూడా నష్టమే జరుగుతుందని చెప్పుకొచ్చారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లింలను ఇబ్బందులకు గురి చేయటాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారని ఉండవల్లి అరుణ్ కుమార్ పేర్కొన్నారు.

## జైలు నుంచి విడుదలైన 'ఐబొమ్మ' రవి




**హైదరాబాద్, పతాకం న్యూస్:** తెలుగు సినిమా పైరసీకి కేంద్రంగా మారిన 'ఐబొమ్మ' వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమంది రవి నేడు చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యాడు. పైరసీ కేసులో అరెస్టయిన రవికి తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయడం తెలిసిందే. తెలుగు సినిమాలను పైరసీ చేస్తూ వెబ్‌సైట్‌లో అక్రమంగా అప్‌లోడ్ చేస్తున్నారన్న ఆరోపణలపై సైబర్ క్రైమ్ పోలీసులు మూడు నెలల క్రితం, గత నవంబరులో రవిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. విదేశాల నుంచి వెబ్‌సైట్‌ను నడుపుతూ, బెట్టింగ్ యాప్‌ల ద్వారా కోట్ల రూపాయలు ఆర్జించినట్లు దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. ఈ పైరసీ వల్ల తెలుగు చిత్ర పరిశ్రమకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లినట్లు ఫిర్యాదులు అందాయి.అరెస్ట్ తర్వాత రవి పలుమార్లు బెయిల్ కోసం ప్రయత్నించినా ఫలితం లభించలేదు. చివరకు హైకోర్టును ఆశ్రయించగా, జస్టిస్ కె. సుజాన నేతృత్వంలోని ధర్మాసనం ఆయన పిటిషన్‌పై విచారణ చేపట్టింది. రవి 90 రోజులకు పైగా జైలులో ఉన్నాడని, ఇప్పటికీ చార్జ్‌షీట్ దాఖలు కాలేదని, దర్యాప్తునకు అతడి సహకారం పూర్తయిందన్న అంశాలను పరిగణనలోకి తీసుకుని బెయిల్ మంజూరు చేసింది. అయితే, బెయిల్ ఇచ్చే క్రమంలో కోర్టు పలు కఠిన షరతులు విధించింది. దేశం విడిచి వెళ్లరాదని, పాస్‌పోర్టును కోర్టుకు సమర్పించాలని ఆదేశించింది. ప్రతిరోజూ ఉదయం 11 గంటలకు సీసీఎస్ పోలీసుల ఎదుట హాజరు కావాలని, సాక్షులను ప్రభావితం చేయవద్దని స్పష్టం చేసింది. షరతులు ఉల్లంఘిస్తే బెయిల్‌ను రద్దు చేస్తామని ధర్మాసనం హెచ్చరించింది. రవి విడుదలైన నేపథ్యంలో ఈ కేసు దర్యాప్తు ఎలా ముందుకు సాగుతుందనేది ఆసక్తికరంగా మారింది.

## కాంగ్రెస్ నేతలు వడ్డీతో సహా చెల్లించుకోవాల్సి ఉంటుంది: కేటీఆర్



**హైదరాబాద్, పతాకం న్యూస్:** బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది పూర్తిగా అక్రమ అరెస్ట్ అని, కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న అధికార దుర్వినియోగానికి పరాకాష్ఠ అని ఆయన మండిపడ్డారు. మంచిర్యాల జిల్లాలోని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీని అడ్డదారుల్లో కైవసం చేసుకోవాలన్న దుర్మార్గపు ఆలోచనతోనే కాంగ్రెస్ ఈ కుట్రకు తెరలేపిందని కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం ఇంతటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడటం సిగ్గుచేటని విమర్శించారు.ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, అప్పుడు కాంగ్రెస్ పార్టీ నేతలు చేస్తున్న ఈ దుర్మార్గాలన్నింటికీ వడ్డీతో సహా చెల్లించుకోవాల్సి వస్తుందని కేటీఆర్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నేతలు గుర్తుంచుకుంటే మంచిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ స్పందిస్తూ... "క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ ఉంది. అయినా సరే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ కలిసి దౌర్జన్యంగా దాన్ని చేజిక్కించుకోవాలని చూస్తున్నారు. ఈ కుట్రలో భాగంగానే సుమన్‌పై అక్రమ కేసులు బనాయించి, ఇవాళ దుర్మార్గంగా అరెస్ట్ చేయించారు. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలకు వ్యతిరేకంగా క్యాతన్‌పల్లి ప్రజలు సంపూర్ణ బంద్ పాటించి నిరసన తెలిపినా ఈ ప్రభుత్వానికి బుద్ధి రాలేదు" అని విమర్శించారు. కొందరు పోలీసు అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు.

# పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు నిర్వహించాలి




**పార్వతీపురం, పతాకం న్యూస్:** జిల్లాలో ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిం చాలని కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 23నుంచి జిల్లా వ్యాప్తంగా 33 కేంద్రాల్లో జరిగే ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలయ్యేలా చూడాలన్నారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఆర్టీసీ బస్సులు నడపాలని సూచించారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఎవరూ సెల్‌ఫోన్లు తేకూడదని తెలిపారు. ఫ్లైయింగ్ , సిట్టింగ్ స్క్వాడ్లను నియమించాలని, కేంద్రాల వద్ద జిరాక్స్, ఇంటర్‌నెట్ సెంటర్లను ఉదయం 8.30 గంటల నుంచి పరీక్ష ముగిసే వరకు మూసివేయించాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో ఆటంకం లేకుండా చూడాలన్నారు. తాగునీరు, పారిశుధ్యం ఏర్పాట్లను రోజూ పర్యవేక్షించాలని తెలిపారు. జిల్లాలో మంజూరైన కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణాల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, త్వరగా వాటి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఒక వేళ సచివాలయం వద్ద స్థలం అందుబాటులో లేకపోతే ప్రజల సౌకర్యార్థం 50 మీటర్ల పరిధిలో లేదా రాకపోకలు ఎక్కువగా ఉండే ప్రాంతాలు, పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. గ్రామ స్థాయిలో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఏఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్‌వోలు సమన్వయంతో పనిచేసి పనుల్లో ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించాలని సూచించారు. నిర్మాణాల పురోగతిని సబ్ కలెక్టర్లు పర్యవేక్షిం చాలన్నారు. క్షేత్రస్థాయిలోని సమస్యలపై ఎంపీడీవోలతో చర్చించాలన్నారు. పెండింగ్ పను లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో అభివృద్ధి పనుల వేగం పెంచాలని, అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి.. నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. పర్యాటక రంగం ద్వారా జిల్లా ఆదాయాన్ని పెంచడంతో పాటు పర్యాటకులకు మరుపురాని అనుభూతిని అందించడమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. జిల్లాలోని ముస్తాబు గ్రామాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దడమే కాకుండా వాటిని ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌గా మార్చాలని సూచించారు. ప్రతి పర్యాటక కేంద్రం నుంచి నెలకు కనీసం రూ.10 లక్షలు ఆదాయం వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాల న్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ మంది పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీతంపేట ఎన్టీఆర్ పార్క్‌లో డీఆర్‌డీఏ, జీసీసీ ఉత్పత్తుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా అద్దె రూపంలో ఆదాయం సమకూర్చుకోవాలని ఆదేశించారు. పార్వతీపురం, గుమ్మ లక్ష్మీపురం తదితర మండలాల్లోని హిల్‌టాప్ ప్రాంతాల్లో స్కైవ్యూ, ట్రెక్కింగ్, గిరి ప్రదిక్షణ వంటి అంశాలపై దృష్టిసారించాలన్నారు. ఈ సమావేశంలో జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, సబ్ కలెక్టర్లు పవార్ స్వప్నిల్ జగన్నాథ్, వైశాలి, డీఆర్వో కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో మరో మెగా డీఎస్సీకి రంగం.. 3600 ఖాళీల భర్తీ

**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ కొలువుల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు అందించబోతోంది. ఏటా డీఎస్సీ నిర్వహిస్తామన్న విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హామీ మేరకు మరో నోటిఫికేషన్‌కు విద్యాశాఖ ముహూర్తం ఖరారు చేసింది. రాబోయే ఉగాది పండగ సందర్భంగా ఈ ప్రకటన విడుదల చేసేలా ప్రణాళికలు సిద్ధమయ్యాయి.

పాఠశాల విద్యాశాఖ సేకరించిన ప్రాథమిక సమాచారం ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3,600 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. వాటి వివరాలు ఇలా ఉన్నాయి.

మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్, సంక్షేమ పాఠశాలలు: 1,200 పోస్టులు.

ప్రభుత్వ, పంచాయతీరాజ్, పురపాలక పాఠశాలలు: 1,700 పోస్టులు.

స్పెషల్ ఎడ్యుకేషన్ (ప్రత్యేక విద్య) పోస్టులు: 700 వరకు.



గత ఏడాది ఏప్రిల్‌లో 16,347 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా, అర్హులైన అభ్యర్థులు లేక మిగిలిపోయిన పోస్టులను కూడా ఇందులో కలిపే అవకాశం ఉంది. కొత్త డీఎస్సీ కోసం ప్రిపేర్ అయ్యే అభ్యర్థులు సిలబస్ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. గత డీఎస్సీకి అనుసరించిన సిలబస్, మార్గదర్శకాలనే ఈసారి కూడా కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అభ్యర్థులకు సమయం తక్కువగా ఉన్నందున, తొలుత భావించిన 'ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ', 'కంప్యూటర్ టెస్టులను' ప్రస్తుతానికి వాయిదా వేశారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు బోధించే ఒప్పంద ఉపాధ్యాయులకు ప్రభుత్వం వెయిటేజీ ఇచ్చే దిశగా ఆలోచిస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం పదేళ్ల సర్వీసు ఉండి టెట్ పాసైన సుమారు 800 మందికి మినిమం టైమ్ స్కేల్ అమలు చేయనున్నారు. వీరు శాశ్వత ఉద్యోగం సాధించాలంటే డీఎస్సీ రాయాల్సి ఉంటుంది. అయితే వీరికి కొంత వెయిటేజీ ఇచ్చే అంశంపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. విద్యాశాఖ వర్గాల సమాచారం ప్రకారం, ఈ నోటిఫికేషన్‌కు సంబంధించి ఫైనాన్స్ క్లియరెన్స్ ప్రక్రియ తుది దశలో ఉంది. ఉగాది నాటికి పోస్టుల సంఖ్యలో స్వల్ప మార్పులు (పెరిగే అవకాశం) ఉండవచ్చు.

# పశువుల ఆసుపత్రుల్లో.. మందుల కృత్రిమ కొరత..!?




**ఏలూరు, పతాకం న్యూస్:** పశువైద్యశాలల్లో మందుల కృత్రిమ కొరత సృష్టిస్తున్నారంటూ పాడిపశు రైతులు, పెంపుడు జంతువుల యజమానులు ఆరోపిస్తున్నారు. అనారోగ్యంగా ఉన్న మూగ జీవాలను పశువుల ఆసుపత్రికి తీసుకెళ్తే జేబులు ఖాళీ అవుతున్నాయని వాపోతున్నారు. చిన్నపాటి అనారోగ్యాల బారిన పడ్డ పశువులు, పెంపుడు కుక్కలకు వైద్యం పేరిట వేలాది రూపాయల మందులను ఆసుపత్రి పక్కనే ఉన్న ప్రైవేటు మందుల షాపుల్లో డాక్టర్లు కొనుగోలు చేయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా మందులు ఇవ్వరా.. అని అడిగితే 'మీకు కావాల్సిన మందులు అయిపోయాయని, బయట కొనుక్కొండి' అని వైద్యులు సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏలూరు ప్రాంతీయ పశువుల ఆసపత్రికి రోజుకు వంద నుంచి 150 పెంపుడు కుక్కలు, ఆవులు, గేదెలు, 10--20, మేకలు, గొర్రెలు 20--30 వరకు చికిత్స నిమిత్తం తీసుకొస్తుంటారు. జిల్లాలో అత్యధికంగా చికిత్సకు వచ్చే పశువుల ఆసుపత్రి ఇదే. ఇక్కడ మందులు ఉచితంగా ఇవ్వరనే విమర్శలున్నాయి. ప్రతి పెంపుడు కుక్కకు, పశువులకు ఒక్కొదానికి రూ.వెయ్యి నుంచి 2, 3 వేల వరకు మందులు, ఇంజక్షన్లు బయటకు రాస్తున్నారని, రక్త పరీక్షలు చేయడానికి జిల్లా ఆసుపత్రిలో లేబరేటరీ ఉన్నా బయట ప్రైవేటు ఆసుపత్రిలో చేయించుకు రావాలని చెబుతున్నారని పశు రైతులు వాపోతున్నారు. దీంతో రెండు, మూడు కిలోమీటర్లు వెళ్లి రూ.ఐదు వేలక పైగా చెల్లించి రక్తపరీక్షలు చేయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేసున్నారు. జిల్లాలో ప్రతి పశువుల ఆసుపత్రిలోను ఇదే విధంగా ప్రైవేటు లేబరేటరీలు, మందుల షాపులకు రాసి సిబ్బంది కమిషన్లు పొందుతున్నారని వారు ఆరోపిస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి జిల్లాలోని పశువుల ఆసుపత్రులకు కోటి 50 లక్షల విలువైన మందులు అందజేస్తుంది. వీటిని ఆయా ఆసుపత్రులకు అవసరం ఉన్న మందులను జిల్లా కేంద్రం నుంచి సరఫరా చేస్తారు. కాని ఏ ఆసుపత్రిలోనూ ఉచితంగా ప్రభుత్వం ఇచ్చిన మందులు ఇవ్వడం లేదని, ప్రభుత్వం నుంచి వచ్చిన మందులు ఏమైపోతున్నాయని రైతులు ప్రశ్నిస్తున్నారు.

జిల్లాలో వెటర్నరీ ఆసుపత్రులు 11, వెటర్నరీ డిస్పెన్సరీస్ 66, రూరల్ లైవ్‌స్టాక్ యూనిట్లు 57 ఉన్నాయి. జిల్లాలో అధికారిక గణాంకాల ప్రకారం ఆవులు లక్షా 21వేల 574, గేదెలు 4లక్షల 80వేలు, గొర్రెలు 5,71,231, మేకలు 2,34,793 ఉన్నాయి. జిల్లాలో పశువుల ఆసుపత్రుల్లో జరుగుతున్న మందుల అవినీతిపై విచారణ చేసి మందులు ఉచితంగా అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో కోర్టులకు బాంబు బెదిరింపులు.. పోలీసులు అలర్ట్



**హైదరాబాద్, అమరావతి, పతాకం న్యూస్:** తెలుగు రాష్ట్రాల్లోని పలు కోర్టులకు బుధవారం బాంబు బెదిరింపులు వచ్చాయి. హైదరాబాద్‌లోని నాంపల్లి, కరీంనగర్, రాజమహేంద్రవరం, అనంతపురం కోర్టులకు ఈ బెదిరింపులు వచ్చాయి. దాంతో ఆయా కోర్టుల్లో బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కోర్టుకు ఈరోజు బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. దీంతో కోర్టు సిబ్బంది త్రీ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. దాంతో కోర్టు ప్రాంగణంలో బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ బాంబు కాల్ రావడంతో.. న్యాయవాదులు, కక్షిదారులను కోర్టు ప్రాంగణం నుంచి పోలీసులు బయటకు పంపేశారు. అలాగే ఈ కాల్ ఎక్కడి నుంచి వచ్చిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు కోర్టులో ఎక్కడా బాంబు ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఈ ఫోన్ కాల్ ఆకతాయి చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మరోవైపు అనంతపురం కోర్టుకూ ఇదే తరహా ఫోన్ కాల్ వచ్చింది. ఇక తెలంగాణలో పలు కోర్టులకు ఈ-మెయిల్స్ ద్వారా బాంబు బెదిరింపులు అందాయి. ఆ జాబితాలో నాంపల్లి కోర్టు సైతం ఉంది. మధ్యాహ్నం 12.05 గంటలకు కోర్టుల్లో బాంబు పేలుతుందంటూ ఈ మెయిల్‌లో అగంతకులు పేర్కొన్నారు. దాంతో కోర్టులోని సిబ్బంది, న్యాయవాదులు, కక్షిదారులను బయటకు పంపి పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. అలాగే కరీంనగర్ కోర్టులో సైతం తనిఖీలు కొనసాగుతున్నాయి. గతంలో సైతం ఇదే తరహాలో కోర్టులకు బాంబు బెదిరింపులు వచ్చాయి.

## డ్రగ్స్‌ను అరికట్టేందుకు కమిషన్ ఏర్పాటు చేయాలి

**తిరుపతి, పతాకం న్యూస్:** అన్నమయ్య జిల్లా మదనపల్లెలో చిన్నారిపై అత్యాచారం చేసి, హత్య చేసిన ఘటనలో నిందితుడు డ్రగ్స్ స్వీకరించి ఉన్నారన్న వార్త తీవ్ర ఆందోళన కలిగిస్తోందని సిపిఎం రాజ్యసభ మాజీ సభ్యులు పెనుమల్లి మధు అన్నారు. సిపిఎం తిరుపతి కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాల కారణంగా హత్యలు, అత్యాచారాలు, దాడులు అధికమయ్యాయని ఆరోపించారు. డ్రగ్స్ మాఫియా తీవ్రతను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పున్నయ్య కమిషన్ తరహాలో రిటైర్డ్ జడ్జితో కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కమిషన్ పర్యటించి మాదక ద్రవ్యాల తీవ్రతకు నిర్దిష్ట సూచనలు చేయడం ద్వారా ప్రభుత్వం చర్యలు తీసుకోవచ్చని చెప్పారు.

## రోడ్డు ప్రమాదంలో బ్యాంకు సెక్యూరిటీ అధికారి మృతి



**తిరుపతి, పతాకం న్యూస్:** బ్యాంకు బంగారాన్ని తరలించే వాహనం రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో సెక్యూరిటీ అధికారి మృతి చెందిన ఘటన తిరుపతి జిల్లాలో జరిగింది. నెల్లూరు వైపు నుండి చెన్నై వైపుకు వెళుతున్న బ్యాంకు బంగారం తరలిస్తున్న సెక్యూరిటీ వాహనం (TN09DJ1832) డ్రైవర్ నిద్ర మత్తులో అదుపు తప్పి హైవే పక్కన పార్కింగ్ కలిగి ఉన్న లారీ (AP24T4489) ని ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. బ్యాంకు బంగారం తరలించే వాహనంకు సెక్యూరిటీగా వచ్చిన అధికారి శర్వానంద్ (58) అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సూళ్లూరుపేట ఎస్సై బ్రహ్మనాయుడు సంఘటనా స్థలానికి చేరుకొని క్రెయిన్ సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం





**రాయచోటి, పతాకం న్యూస్:** బాల్య వివాహాలు చేస్తే చట్ట ప్రకారం కఠిన శిక్షణ తప్పవని 5వ జిల్లా అదనపు జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి పేర్కొన్నారు. సమత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై జిల్లా స్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించడం కోసం రూపొందించిన బాల్య వివాహ విముక్తి రథంను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ 2030 సంవత్సరం నాటికి భారతదేశంలో బాల్యవివాహాలు జరగకుండా చేసి బాల్య వివాహ రహిత దేశంగా రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించిందిన్నారు. ఆ లక్ష్యాన్ని చేరుకోవాలంటే ప్రజలు, విద్యార్థులు ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు అందరూ యుద్ధ ప్రాతిపదికన విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో సమత స్వచ్ఛంద సంస్థ ఈ ప్రచార రథము ద్వారా జిల్లాలో ప్రచారం చేయడానికి సంకల్పించడం హర్షనీయం అన్నారు.

## ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



**నూజివీడు, పతాకం న్యూస్:** ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. నూజివీడు ఆర్‌టిసి బస్టాండ్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, ప్రయాణీకులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. బస్టాండ్‌లో సౌకర్యాలు, ఆర్‌టిసి సిబ్బంది ప్రవర్తనలను ప్రయణీకులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్‌టిసి ప్రయాణీకుల భద్రత, సౌకర్యాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా ప్రయాణీకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ఆర్‌టిసి అధికారులపై ఉందన్నారు. ప్రయాణీకుల భద్రతకు సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి, వాటిని దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం చేస్తామని, దీనికారణంగా రాత్రి సమయాల్లో బస్టాండ్ పరిసరాల్లో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా నివారించవచ్చున్నారు. ఏలూరులో ఇటీవల జరిగిన డిఆర్‌సి సమావేశంలో రాష్ట్ర గృహనిర్మాణ సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి నూజివీడు బస్టాండ్‌లో ప్రయణీకుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్న సూచనల మేరకు బస్టాండ్‌లో సౌకర్యాలను పరిశీలించేందుకు వచ్చామన్నారు. నూజివీడు బస్టాండ్‌లో ఆర్వో మంచినీరు, అదనపు టాయిలెట్లు, బెంచీలు ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. మహిళలు, చిన్నారుల భద్రత, గృహ హింసకు సంబంధించి ఫిర్యాదు చేయవలసిన నంబర్లను బస్టాండ్‌లో ప్రముఖంగా తెలిసేలా ప్రదర్శించాలని ఆర్‌టిసి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. బస్టాండ్‌లో తినుబండారాల షాపుల్లో నాణ్యతను, వ్యాపారులు అధిక ధరలకు అమ్మకుండా అధికారులు తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. ఆర్‌టిసి బస్టాండ్లలో ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు, భద్రత, ప్రయణీకులతో డ్రైవర్, కండక్టర్, తదితర సిబ్బంది ప్రవర్తన, తదితర విషయాలపై ప్రజాభిప్రాయాలు, ప్రజల సంతృప్తి స్థాయిని రాష్ట్ర ప్రభుత్వం ఐవిఆర్‌ఎస్ విధానం ద్వారా ప్రజల నుండి తెలుసుకుంటుందన్నారు.

# విటమిన్ బి12 లోపం ఉంటే శరీరంలో కనిపించే లక్షణాలు ఇవే!



విటమిన్ బి12 లోపం ఉంటే మన శరీరంలో కనిపించే లక్షణాలు ఇవే..! మన శరీరానికి అవసరమయ్యే బి కాంప్లెక్స్ విటమిన్లలో విటమిన్ బి12 కూడా ఒకటి. దీనిని కోబాలమిన్ అని కూడా పిలుస్తారు. ఇది నీటిలో కరిగే విటమిన్. విటమిన్ బి12 మన శరీరంలో ముఖ్య విధులను నిర్వర్తిస్తుంది. నాడీ కణాల నిర్మాణంలో, ఎర్ర రక్తకణాల నిర్మాణంలో, డీఎన్ఏ సంశ్లేషణకు ఈ విటమిన్ చాలా చాలా అవసరం. మన శరీరానికి అవసరమయ్యే బి కాంప్లెక్స్ విటమిన్లలో విటమిన్ బి12 కూడా ఒకటి. దీనిని కోబాలమిన్ అని కూడా పిలుస్తారు. ఇది నీటిలో కరిగే విటమిన్. విటమిన్ బి12 మన శరీరంలో ముఖ్య విధులను నిర్వర్తిస్తుంది. నాడీ కణాల నిర్మాణంలో, ఎర్ర రక్తకణాల నిర్మాణంలో, డీఎన్ఏ సంశ్లేషణకు ఈ విటమిన్ చాలా చాలా అవసరం. శరీరంలో విటమిన్ బి12 లోపించడం వల్ల మనం అనారోగ్యానికి గురి కావాల్సి వస్తుంది. ఈ విటమిన్ లోపాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల మనం తీవ్ర అనారోగ్యానికి గురయ్యే అవకాశం కూడా ఉంది. విటమిన్ బి12 ఉండే ఆహారాలను తీసుకోకపోవడం, జీర్ణాశయంలో హైడ్రోక్లోరిక్ ఆమ్లం లేకపోవడం, రక్తహీనత ఎక్కువగా ఉండడం, ఉదర కుహర వ్యాధులు ఎక్కువగా ఉండడం వంటి కారణాల వల్ల శరీరంలో విటమిన్ బి12 లోపం తలెత్తుతుంది.

విటమిన్ బి12 లోపించినప్పుడు మనం శరీరం కొన్ని సంకేతాలను ఇస్తుంది. ఈ హెచ్చరికలను ముందుగానే గుర్తించడం వల్ల తీవ్ర అనారోగ్యానికి గురి కాకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు. విటమిన్ బి12 లోపాన్ని హెచ్చరికల ద్వారా శరీరం ఏ విధంగా తెలియజేస్తుందో.. ఇప్పుడు తెలుసుకుందాం. శరీరంలో విటమిన్ బి12 లోపించడం వల్ల గాయాలు త్వరగా నయం అవ్వవు. విటమిన్ బి12 లోపించడం వల్ల ఎర్రరక్తకణాల ఉత్పత్తి తగ్గుతుంది. దీంతో శరీరానికి ఆక్సిజన్, రక్తం సరఫరా తగ్గుతాయి. దీంతో గాయాలు నయం అవ్వడానికి సమయం ఎక్కువగా పడుతుంది. విటమిన్ బి 12 లోపించడం వల్ల పాదాల్లో జలదరింపు ఎక్కువగా ఉంటుంది. పాదాల్లో తిమ్మిర్లు, నరాలు దెబ్బతినడం, నడవడం కష్టంగా మారడం వంటి లక్షణాలు విటమిన్ బి12 లోపాన్ని సూచిస్తాయి.

వీటితో పాటు విటమిన్ బి12 లోపించడం వల్ల అలసిపోయినట్టుగా, శరీరం బలహీనంగా ఉన్నట్టు ఉంటుంది. వికారం, వాంతులు లేదా విరేచనాలు అవుతాయి. ఆకలి తగ్గడం, శరీర బరువు తగ్గడం కూడా జరుగుతుంది. ఇవే కాకుండా నోరు నొప్పిగా ఉండడం, చర్మం సున్నితంగా మారడం, నాడీ సంబంధిత సమస్యలు తలెత్తడం, కంటిచూపు మందగించడం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. విటమిన్ బి12 లోపించడం వల్ల మానసిక సమస్యలు కూడా తలెత్తుతాయి. ఆందోళనగా, గందరగోళంగా ఉంటుంది. చికాకు, డిప్రెషన్ వంటి సమస్యలు మరింత ఎక్కువ అవుతాయి. జ్ఞాపకశక్తి తగ్గుతుంది. మనం ప్రవర్తించే తీరు కూడా మారుతుంది.

ఇటువంటి లక్షణాలను బట్టి మన శరీరంలో విటమిన్ బి12 లోపం ఉందని గ్రహించాలి. వైద్యుడిని సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలి. ఈ సమస్యతో బాధపడే వారికి ముందుగా సప్లిమెంట్స్ ను సూచిస్తున్నారు. సమస్య తీవ్రతను బట్టి వారానికి ఒక విటమిన్ బి12 ఇంజెక్షన్ ను కూడా సిఫార్సు చేస్తారు. ఇక వీటితో పాటు విటమిన్ బి12 ఎక్కువగా ఉండే ఆహారాలను కూడా తీసుకోవాలి. విటమిన్ బి12 ఎక్కువగా మాంసాహారంలో ఉంటుంది. గుడ్లు, చేపలు, మాంసం, లివర్, పీతలు, పుట్టగొడుగులు, పాలు, పాల పదార్థాలు, టోఫు వంటి ఆహారాల్లో విటమిన్ బి12 ఉంటుంది. ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల విటమిన్ బి12 లోపం తగ్గడంతో పాటు భవిష్యత్తులో కూడా రాకుండా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

## కాలేజీలు, స్కూళ్లకు ఏఐని అందుబాటులోకి తీసుకొస్తాం: కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ భారత్ భవిష్యత్ ఏఐ ప్లాన్‌ను స్పష్టంగా వివరించారు. దేశాన్ని ప్రపంచ ఏఐ పటంలో నాయకుడిగా నిలబెట్టడమే లక్ష్యంగా పాఠశాల, కాలేజీ స్థాయి సిలబస్‌ను పూర్తిగా మారుస్తున్నామని ప్రకటించారు.విద్యార్థులకు ఏఐ నాలెడ్జ్ ను పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర మంత్రి అన్నారు. పాఠశాలలు, కళాశాలలకు ఏఐ సాధనాలు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. విద్యార్థులు కేవలం సాంకేతికతను నేర్చుకోవడమే కాకుండా, సమస్యలకు కొత్త పరిష్కారాలను అభివృద్ధి చేసేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. "దేశంలో ప్రతిభకు కొరత లేదు. యువత భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా నైపుణ్యాలు మెరుగుపరుచుకుంటే... భారత్ ప్రపంచ ఏఐ పటంలో అగ్రస్థానంలో నిలుస్తుంది" అని అన్నారు. సెమీకండక్టర్, టెలికాం రంగాల్లో సాధించిన విజయాల తరహాలోనే ఏఐ మిషన్‌ను వేగవంతం చేస్తామని మంత్రి అన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీ వంటి సంస్థలు పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాయని ప్రశంసించారు.

## పన్నుల వసూలు వేగవంతం చేయాలి

**అంబాజీపేట, పతాకం న్యూస్:** ఇంటి పన్నులు వసూలు వేగవంతం చేయాలని డిపిఓ డి.శాంతా లక్ష్మి ఆదేశించారు. మాచవరం పంచాయతీ నందు గురువారం సందర్శించి స్వర్ణ పంచాయితీ పోర్టల్ నందు ఆన్లైన్ క్యూ ఆర్ కోడ్ ద్వా రా వసూళ్లను ఆమె పరిశీలించారు. డిపిఓ సూచనల మేరకు పన్నుల వసూలుపై చాటింపు వేసి ప్రజలకు అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపట్టామని డిప్యూటీ ఎంపిడిఓ కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల పరిధిలో పంచాయతీ కార్యదర్శులు అందరూ టీములు పెంచి ఉన్నతాధికారుల ఆదేశాల మేర కు నూరు శాతం ఇంటి పనులు వసూలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ విజిట్ నందు మాచవరం పంచాయతీ కార్యదర్శి కెవివి సత్యనారాయణమూర్తి, సిబ్బంది ఎలక్ట్రిషన్ పండు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాకుళంలో పట్టాలెక్కని పర్యాటక ప్రాజెక్టులు!



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** జిల్లా తీర ప్రాంతాల్లో పర్యాటక ప్రాజెక్టులు పట్టాలెక్కడం లేదు. పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు పదేళ్ల కిందట 61 బీచ్‌లను అధికారులు గుర్తించారు. దీంతో ప్రభుత్వానికి ఆదాయం పెరగడంతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందని అంతా భావించారు. కానీ, ఇంతవరకు ఆ ప్రాజెక్టులకు అతీగతి లేదు. గత ప్రభుత్వం వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వంలో కూడా అదే నిర్లక్ష్యం నెలకొంది. జిల్లాలో సుదీర్ఘ సముద్ర తీరం ఉంది. ఇచ్ఛాపురం మండలం డొంకూరు నుంచి రణస్థలం మండలం దోనిపేట వరకూ 193 కిలోమీటర్ల మేర తీరం విస్తరించి ఉంది. ఈ తీర ప్రాంతంలో పర్యాటక రంగం అభివృద్ధికి అవసరమైన అన్ని వనరులు ఉన్నాయి. కానీ, గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. ఐదేళ్ల పాలనలో పర్యాటక రంగం కోసం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కూటమి ప్రభుత్వంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు సమీపిస్తున్నా పర్యాటక ప్రాజెక్టుల విషయంలో ఆశించిన పురోగతి లేదు. డొంకూరు, కవిటి, బారువ, అక్కుపల్లి, భావనపాడు, కళింగపట్నం, మొగదాలపాడు, కల్లేపల్లి, గనగళ్లపేట, బందరువానిపేట తీరాలు పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి అవకాశం ఉన్నా పట్టించుకోవడం లేదు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లాలోని 11 తీర మండలాల్లో పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు నిర్ణయించింది. తీరంలో 61 బీచ్‌లను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అవకాశముందని 2016లోనే గుర్తించింది. అందులో భాగంగా కళింగపట్నం బీచ్‌లో ప్రయోగాత్మకంగా కొన్ని పర్యాటక పనులు మొదలుపెట్టారు కూడా. ఇంతలోనే అధికారం రావడం.. వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. జిల్లాలో బాహుదా, మహేంద్రతనయా, వంశధార, నాగావళి నదీ సంగమాలు ఉన్నాయి. తీరానికి దగ్గరగా పురాణ, చారిత్రక, ఇతిహాసాలతో ప్రసిద్ధి చెందిన ఆలయాలు, పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. చిత్తడి, బీల నేలల సోయగాలు కూడా కనువిందు చేస్తాయి. విదేశాల నుంచి వేలాది కిలోమీటర్లు దాటుకుంటూ ఇక్కడకు పక్షులు వస్తుంటాయి. తెలవారగానే కిలకిలారావాలతో నిద్రలేపుతాయి. పూండి, నౌపడ ఉప్పుగల్లీలు, మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లో ఎర్రమట్టి దిబ్బలు, తీరంలో నల్ల రాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. వీటిని అభివృద్ధి చేస్తే ప్రభుత్వానికి ఆదాయం పెరగడంతో పాటు నిరుద్యోగ యువతకు మెండుగా ఉపాధి లభిస్తుంది.




### ఆల్ రౌండర్ శివమ్ దుబే అద్భుత ప్రదర్శన

# నెదర్లాండ్స్‌పై భారత్ విజయం



టీ20 ప్రపంచకప్ 2026లో భారత జట్టు తన జైత్రయాత్రను కొనసాగిస్తోంది. గ్రూప్-ఏలో భాగంగా తన చివరి లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 17 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌పై విజయం సాధించింది. ఆల్ రౌండ్ ప్రదర్శనతో శివమ్ దుబే ఈ మ్యాచ్‌లో హీరోగా నిలిచాడు. బ్యాటింగ్‌లో అద్భుత అర్ధశతకం సాధించడంతో పాటు బౌలింగ్‌లోనూ కీలక వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో ప్రధాన పాత్ర పోషించాడు. గ్రూప్-ఏలో భారత్ వరుసగా నాలుగు మ్యాచ్ లు గెలిచి, ఓటమన్నదే లేకుండా సూపర్-8లోకి అడుగుపెట్టనుంది.

అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో నెదర్లాండ్స్ తో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఆదిలోనే అభిషేక్ శర్మ (0) వికెట్ కోల్పోయినప్పటికీ, ఇషాన్ కిషన్ (18) వేగంగా ఆడాడు. ఆ తర్వాత తిలక్ వర్మ (31), కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (34) నిలకడగా రాణించారు. అయితే, అసలు సిసలు విధ్వంసం సృష్టించింది శివమ్ దూబేనే. కేవలం 31 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లతో 66 పరుగులు చేశాడు. చివర్లో హార్దిక్ పాండ్యా (30) కూడా రాణించడంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 193 పరుగుల భారీ స్కోరు సాధించింది. నెదర్లాండ్స్ బౌలర్లలో లోగాన్ వాన్ బీక్ 3, ఆర్యన్ దత్ 2 వికెట్లు తీశారు.

194 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో నెదర్లాండ్స్ గట్టిగానే పోరాడింది. బాస్ డి లీడ్ (33), కోలిన్ అకెర్‌మాన్ (23), జాక్ లయన్-కాచెట్ (26) రాణించారు. అయితే, భారత బౌలర్లు కీలక సమయాల్లో వికెట్లు తీసి ఒత్తిడి పెంచారు. ముఖ్యంగా స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి కేవలం 14 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టి నెదర్లాండ్స్ పతనాన్ని శాసించాడు. శివమ్ దూబే బంతితోనూ రాణించి 2 వికెట్లు తీయగా, బుమ్రాకు ఒక వికెట్ దక్కింది. దీంతో నెదర్లాండ్స్ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లకు 176 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. ఈ విజయంతో భారత్ గ్రూప్ దశను అజేయంగా ముగించింది. తద్వారా 4 మ్యాచ్ ల్లో 4 విజయాలతో గ్రూప్-ఏలో టాపర్ గా నిలిచింది.

సూపర్-8లో గ్రూప్-1లో ఉన్న భారత్... ఫిబ్రవరి 22న దక్షిణాఫ్రికాతో, ఫిబ్రవరి 26న జింబాబ్వేతో, మార్చి 1న వెస్టిండీస్ తో తలపడనుంది.

## ముచ్చటగా మూడో సారి అభిషేక్ శర్మ డకౌట్



'అభిషేక్ శర్మ'.. ఈ పేరు వింటే ప్రత్యర్థి జట్లకు వణుకుపుట్టేది. అతడికి ఎలా బౌలింగ్ చేయాలి, ఎలాంటి బంతులు సంధించాలో తెలియక బౌలర్లు తలలు పట్టుకునేవారు. ఇలా అందరినీ షేక్ చేసే అభిషేక్ శర్మ.. ఇటీవల అతను షేక్ అవుతున్నాడు. టీ20 ప్రపంచకప్ 2026లో ఈ టీమిండియా విధ్వంసకర ఓపెనర్ చెత్త ఫామ్ కొనసాగుతోంది. ఈ టోర్నీలో శర్మ ఆడిన తొలి రెండు మ్యాచ్‌ల్లో (యూఎస్ఏ, పాకిస్తాన్) డకౌట్లు కాగా.. పసికూన నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ ఖాతా తెరవలేక హ్యాట్రిక్ డకౌట్ల అపఖ్యాతిని మూటగట్టుకున్నాడు. టీ20 ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నంబర్ వన్ బ్యాటర్‌గా అభిషేక్ శర్మ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఇలాంటి టాప్ ప్లేయర్ ఐసీసీ మెగా టోర్నీలో ఆశించిన మేర రాణించడం లేదు. తన తొలి టీ20 ప్రపంచకప్ లో మూడు మ్యాచ్ లు ఆడినా అభిషేక్ ఖాతా తెరవలేకపోవడం శోచనీయం. అంతేకాక చివరి 7 అంతర్జాతీయ టీ20 ఇన్నింగ్స్‌లో ఇది ఐదో డకౌట్ కావడం మరింత దారుణం. నెదర్లాండ్స్ తో జరిగిన మ్యాచ్‌లో జెర్సీ మార్పు కూడా సత్ఫలితాన్ని ఇవ్వలేదు. అభిషేక్ తన రెగ్యులర్ జెర్సీ కాకుండా సిరాజ్ వేసుకునే 73వ నంబర్ జెర్సీ ధరించి బరిలోకి దిగినా పరుగుల ఖాతాను ఓపెన్ చేయలేదు. తాజా డకౌట్ తర్వాత అభిషేక్.. సంజూ శాంసన్ పేరిట ఉన్న ఓ చెత్త రికార్డును సమం చేశాడు. ఓ క్యాలెండర్ ఇయర్‌లో టీ20ల్లో అత్యధిక డకౌట్లైన భారత బ్యాటర్‌గా సంజూ శాంసన్ (2024) సరసన చేరాడు. సంజూ, అభిషేక్ ఇప్పుడు తలో ఐదు డకౌట్లతో కొనసాగుతున్నారు.




# ఐశ్వర్య రాజేశ్ కొత్త సినిమా 'అండర్ 18'



ప్రముఖ నటి ఐశ్వర్య రాజేశ్, నటుడు విక్రాంత్ ప్రధాన పాత్రలలో తెరకెక్కుతున్న కొత్త చిత్రానికి 'అండర్ 18' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమా టైటిల్ లుక్‌ను ప్రముఖ దర్శకుడు వెట్రిమారన్ ఆవిష్కరించడం విశేషం. ఈ చిత్ర దర్శకుడు కార్తీక్ పెరుమాల్‌సామి గతంలో వెట్రిమారన్ దగ్గర అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేశారు.

ఎస్ఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై బి. జగదీశ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'మద్రాస్‌కారన్' విజయం తర్వాత ఈ సంస్థ నిర్మిస్తున్న చిత్రమిది. 'అండర్ 18' సినిమా వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఒక ఎమోషనల్ క్రైమ్ డ్రామా అని చిత్ర యూనిట్ తెలిపింది. నేరం కారణంగా ప్రభావితమైన ఒక కుటుంబం యొక్క భావోద్వేగాలను, క్రైమ్ ప్రపంచంలోని క్రూరమైన కోణాలను ఈ సినిమాలో చూపించనున్నట్లు తెలుస్తోంది. తమిళనాడులోని అంతగా వెలుగులోకి రాని కొన్ని నేరాల నేపథ్యాన్ని దర్శకుడు ఈ కథ కోసం ఎంచుకున్నారని సమాచారం. సామాజిక వాస్తవికత, కుటుంబ భావోద్వేగాల కలబోతగా ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రంలో కిశోర్‌తో పాటు పలువురు ప్రముఖ నటులు కీలక పాత్రలలో కనిపించనున్నారు. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. హోసూర్, చెంగల్పట్టు, చెన్నైలోని వాస్తవ లొకేషన్లలో చిత్రీకరణ జరపనున్నారు. ఈ చిత్రానికి ప్రముఖ సినిమాటోగ్రాఫర్, దర్శకుడు వేల్‌రాజ్ కెమెరామ్యాన్‌గా పనిచేస్తుండగా, సామ్ సి.ఎస్. సంగీతం అందిస్తున్నారు. ఇళంగో కృష్ణన్, కార్తీక్ నేతా పాటలకు సాహిత్యం అందిస్తున్నారు.

# సత్యదేవ్, ఫరియా కొత్త చిత్రం ప్రారంభం



సత్యదేవ్, ఫరియా అబ్దుల్లా జంటగా కొత్త సినిమా మొదలైంది. లక్ష్మీ నారాయణ పుట్టంచెట్టి దర్శకత్వంలో బి. నరేంద్ర రెడ్డి ఈ సినిమాని నిర్మిస్తున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి అనిల్ రావిపూడి ముఖ్య అతిథిగా హాజరై హీరో హీరోయిన్లపై క్లాప్ ఇచ్చారు. ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి కెమెరా స్విచ్చాన్ చేశారు. లక్ష్మీనారాయణ పుట్టంచెట్టి ఫస్ట్ షాట్‌కు డైరెక్షన్ చేశారు. ఈ సందర్భంగా వంశీ నందిపాటి మాట్లాడుతూ, 'నా స్నేహితుడు ప్రొడ్యూసర్ నరేంద్ర మరో మంచి చిత్రాన్ని చేస్తున్నారు. హీరో సత్యదేవ్ ఒక ఔట్ అండ్ ఔట్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నారు. ఈ సినిమా ఆయనకు బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ అవుతుంది. ఈ సినిమా సాధించబోయే విజయం గురించి తర్వాత మళ్లీ మాట్లాడతాను. డైరెక్టర్ లక్ష్మీనారాయణకు కూడా ఈ సినిమా మంచి పేరు తీసుకొస్తుంది' అని అన్నారు. లక్ష్మీనారాయణ పుట్టంచెట్టి మాట్లాడుతూ, 'మా సినిమా జానర్ ఏమిటని అందరూ అడుగుతున్నారు. అందరి పెదాలపై నవ్వుల పూయించే చిత్రమిది. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ కు వెళ్తున్నాం. రామ్ మిరియాల మా సినిమాకు మంచి మ్యూజిక్ చేస్తున్నారు. ఫస్ట్ టైమ్ ఒక కంప్లీట్ మూవీకి ఆయన సంగీతాన్ని అందిస్తున్నారు' అని చెప్పారు. ఈ సినిమాలో ఇతర ప్రధాన పాత్రలను 'వెన్నెల' కిషోర్, వైవా హర్ష, ఎస్ఎస్ కాంచి, సురేష్ గురు పోషిస్తున్నారు.




# ఇండో-అమెరికన్ మూవీలో నటించబోతున్న ప్రియమణి!



టాలీవుడ్ నుంచి బాలీవుడ్ కు వెళ్లిన ప్రియమణి... పలు వెబ్ సిరీస్ లలో కూడా నటిస్తూ బిజీగా ఉంటోంది. ఇప్పుడు హాలీవుడ్ మూవీలో నటించేందుకు సిద్ధమవుతోంది. ఇండో-అమెరికన్ చిత్రంలో ప్రియమణి ప్రధాన పాత్రకు ఎంపికయింది. బాలీవుడ్ నటుడు మోహిత్ రైనా తో కలిసి ఆమె ఈ అంతర్జాతీయ చిత్రంలో నటించబోతోంది.

హర్ష్ మహదేశ్వర్ దర్శకత్వం వహించనున్న ఈ సినిమాను అమెరికాకు చెందిన రెడ్ బైసన్ ప్రొడక్షన్స్, ముంబైలోని అజూర్ ఎంటర్టైన్మెంట్ సంయుక్తంగా నిర్మించనున్నాయి. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా నిర్మాణ సంస్థలు అధికారికంగా ప్రకటించాయి.

భారతీయ, అమెరికా సంస్కృతుల కలయికతో, ఒక వలస కుటుంబం ఎదుర్కొనే భావోద్వేగపూరిత ప్రయాణమే ఈ సినిమా కథాంశం. హాలీవుడ్ సూపర్ హిట్ సినిమాలకు పనిచేసిన అగ్రశ్రేణి సాంకేతిక నిపుణులు ఈ ప్రాజెక్ట్ కోసం పనిచేస్తుండటం గమనార్హం. ఈ సినిమా షూటింగ్ ఏప్రిల్ లో ప్రారంభం కానుంది.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**